Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 90 మేడ్చల్ మల్కాజ్‌గిరి 22 ఏప్రిల్ 2023 శనివారం పేజీలు : 4

## జాతీయ హోదాపై అమిత్‌షాకు మమత ఫోన్?

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ఎమ్మెల్యే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి తృణ మూల్ కాంగ్రెస్ పార్టీ జాతీయ హోదా గురించి మాట్లాడారని ప్రచారం జరుగుతోంది. టీఎంసీ ఇటీవలే జాతీయ పార్టీ హోదా కోల్పోయినట్లు ఈసీ ప్రకటించిన నేపథ్యంలో హోదా పునరుద్ధరణ కోసం షాకు దీదీ ఫోన్ చేశారని జరుగుతున్న ప్రచారంపై తృణమూల్ మండిపడింది. పుకార్లు ప్రచారం చేస్తున్న పశ్చిమబెంగాల్ ప్రతిపక్షనేత సువేందు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అంతేకాదు తాను షాకు ఫోన్ చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని కూడా దీదీ కోల్‌కతాలో హెచ్చరించారు. 2024లో బీజేపీ అధికారంలోకి రాబోదని మమత జోస్యం చెప్పారు. బీజేపీకి రెండొందలకు మించి సీట్లు రాబోవన్నారు. అధికారంలో ఉన్నారని ఏది పడితే అది చేస్తామంటే కుదరదని బీజేపీకి దీదీ హితవు చెప్పారు.



# 'మరాఠా గడ్డపై పాగా వేయాలని'

## 24న సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభ..!!

హైదరాబాద్ : బీఆర్ఎస్ ఏర్పాటు తరువాత సీఎం కేసీఆర్ రాజకీయంగా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో ఎన్నికలకు సిద్ధం కావాలని ఇప్పటికే పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసారు. కొత్త నిర్ణయాలతో రాజకీయంగా వేడి పెంచుతున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ విస్తరణలో భాగంగా తొలి అడుగు మహారాష్ట్రలో వేయాలని సీఎం డిసైడ్ అయ్యారు. మహారాష్ట్ర వేదికగా ఇప్పటికే స్పందన పెరగటంతో మరో సారి సభ నిర్వహణకు సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ నెల 24న గాబాద్‌లో లక్షన్నర మందితో మరో భారీ సభ నిర్వహించేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది. మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్ లో చేరికలు పెరుగుతున్నాయి. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 5న భారీ సమావేశాన్ని నిర్వహించారు. ఆ సభకు మంచి స్పందన వచ్చింది. ఆ సభ అనంతరం కేవలం 55 రోజుల వ్యవధిలోనే కంధార్ నియోజకవర్గం లోహా పట్టణంలో మార్చి 26న రెండో సభను నిర్వహించారు. ఈ సభకు నాందేడ్ సభకు మించి రెట్టింపు సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. తొలి రెండు సభలు దిగ్విజయం కావడంతో రెట్టించిన ఉత్సాహంతో ఇప్పుడు మరో భారీ సభకు బీఆర్ఎస్ సిద్ధమైంది.

ఈ సారి లక్షన్నర మందితో ఔరంగాబాద్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నది. మహారాష్ట్ర నడిబొడ్డయిన ఔరంగబాద్‌లో నిర్వహించనుండటంతో బీఆర్ఎస్ నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. కేసీఆర్ ఆ రెండు సభల్లో వివరించిన అంశాలపై ఇప్పుడు మహారాష్ట్రలో జోరుగా చర్చ నడుస్తున్నది. తాజాగా నాసిక్‌కు చెందిన పలువురు సిట్టింగ్ కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో, ఔరంగాబాద్ లో ఈ నెల 24న నిర్వహించే సభకు బీఆర్ఎస్ ఏర్పాట్లు ప్రారంభించింది. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఔరంగాబాద్ చేరుకొన్నారు. మంత్రి గంగుల కమలాకర్‌కు తప్పిన ప్రమాదం: కాలికి గాయం కన్నాడ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కిసాన్ సెల్ మహారాష్ట్ర అధ్యక్షుడు మాణిక్ కదం ఆధ్వర్యంలో భారీ సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఇప్పటికే ఈ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ జాదవ్ బీఆర్ఎస్‌లో చేరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహారాష్ట్రలో పోటీ చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

## సామాన్యులు సచివాలయం రావాలంటే ఇంత కష్టమా...!?

హైదరాబాద్ : ప్రజా పాలన ఎలా ఉండాలి? ప్రజలు కోసం ప్రజలు ఎన్నుకునే ప్రజల ప్రభుత్వంలో ప్రజలకు.. ప్రభుత్వానికి మధ్య దూరం అవసరమా? సామాన్యుడు సైతం సీఎంను కలిసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేని పరిస్థితులు గతకాలపు ఘనతలుగా మారిపోతున్నాయా? రాష్ట్ర ప్రభుత్వ కార్యస్థలిగా పేర్కొనే సచివాలయం సామాన్యులు కనీసం అడుగుపెట్టేందుకు కూడా సాధ్యం కాని రీతిలో అమలు చేయనున్ననిబంధనలు బంధనాలుగా మారతాయన్న విషయాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు గుర్తించటం లేదు? భారీ కోటల మాదిరి భవనాల్ని నిర్మించటం బాగానే ఉన్నా.. వాటిల్లోకి తమ ఇంట్లోకి వెళ్లినంత సులువుగా వెళ్లటం ముఖ్యం. అందుకు భిన్నంగా అనుమతుల పేరుతో ఏర్పాటు చేసే నిబంధనలు ప్రజలకు ప్రతిబంధకాలుగా మారతాయన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. వందల కోట్ల ఖర్చుతో భారీ ఎత్తున నిర్మిస్తున్న సరికొత్త సచివాలయం ఓపెనింగ్ కు సిద్ధమవుతోంది. అయితే.. సచివాలయానికి కల్పించే భద్రత విషయంలో కేసీఆర్ సర్కారు చేపట్టిన చర్యలు మింగుడుపడని రీతిలో ఉంటున్నాయని చెప్పాలి. గతంలో సచివాలయ భద్రతను రాష్ట్ర పోలీసులు నిర్వహించేవారు. తర్వాతి కాలంలో దీన్ని ప్రత్యేక భద్రతా దళం పర్యవేక్షిస్తోంది. రానున్న రోజుల్లో రాష్ట్ర స్పెషల్ పోలీస్ చేతుల్లోకి వెళ్లనున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం వంద మంది సిబ్బందితో భద్రత నిర్వహిస్తుండగా.. కొత్త సచివాలయం ప్రారంభం నుంచి 650 మందికి పైగా కాపలా కాస్తారని చెబుతున్నారు. మొత్తం మూడు టీంలతో కలిపి భద్రతను నిర్వహిస్తారు. ఒక్కోటీంలో 300 మంది ఉంటారని.. వారితో పాటు మరో 300 మంది రిజర్వులో ఉంటారని చెబుతున్నారు. వాహనాల రాకపోకల్ని నియంత్రించేందుకు 22 మంది ట్రాఫిక్ పోలీసుల్ని కేటాయిస్తారని చెబుతున్నారు. ఇక.. సచివాలయానికి సామాన్యులు రావాలంటే ముందస్తు అనుమతి ఉంటే తప్పించి లోపలకు వెళ్లలేరు. ఎవరైనా సరే సచివాలయంలో ఏ బ్లాక్ కు వెళ్లాలనుకుంటున్నారో అక్కడికి మాత్రమే వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సచివాలయంలోని ఏ బ్లాక్ కు అయినా వెళ్లే వీలుంది. రానున్నరోజుల్లో అలాంటి అవకాశమే ఉండదు. ఎంట్రీ దగ్గర బార్ కోడ్ తో ఇచ్చే పాస్ లు.. ఎవరిని కలవాలని అనుకుంటున్నారో వారిని మాత్రమే కలిసేందుకు మాత్రమే అనుమతి ఉంటుంది. వేరే వారిని కలిసేందుకు యాక్సిస్ ఉండదు. దీంతో.. ఇతర బ్లాకులకు వెళ్లే వీలు ఉండదు. సచివాలయంలోని ఆరు అంతస్తుల్లోని మెట్ల మార్గంలోనూ లిఫ్టుల వద్ద పోలీసులు ఉంటారు.



300 సీసీ కెమెరాల్ని ఏర్పాటు చేస్తారు. వాటిని పరిశీలించేందుకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదాలు ఏర్పడితే నివారించేందుకు వీలుగా రెండు అగ్నిమాపక వాహనాల్ని.. 34 మంది సిబ్బందిని సచివాలయం ఆవరణలోనే ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బాడీ.. బ్యాగేజ్.. వెహికిల్ స్కానర్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తంగా.. సచివాలయం కాస్తా రాజప్రసాదం మాదిరి మారనుందన్న మాట వినిపిస్తోంది.

## కేసీఆర్‌పై పోరాడేది.. ప్రభుత్వంలోకి వచ్చేది బీజేపీనే...

హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి జూపల్లి కృష్ణారావుతో వంద శాతం సంప్రదింపులు జరుపుతున్నామని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో పురోగమిస్తున్న పార్టీ బీజేపీ మాత్రమేనని.. ఎక్కడ రాజకీయ భవిష్యత్ ఉంటే ఆపార్టీలోనే నాయకులు చేరుతారన్నారు.




సీఎం కేసీఆర్‌పై పోరాడేది.. ప్రభుత్వంలోకి వచ్చేది బీజేపీయేనని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వేర్వేరు కాదని.. ఎన్నికల ముందైనా.. తర్వాతైనా రెండు పార్టీలు కలుస్తాయని ఈటల రాజేందర్ అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీఎం కేసీఆర్ రూ. 25 కోట్లు పంపించారన్నారు. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా చేవెళ్ళ సభలో పాల్గొంటారని, దేశంలోని అన్ని పార్టీలకు ఎన్నికల ఖర్చు భరించేంత వేల కోట్లు ఎలా వచ్చాయో ముఖ్యమంత్రి చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

# కిషన్‌రెడ్డితో మిషన్ బిజెపి

## ఏపీ - తెలంగాణాలపై గురి




హైదరాబాద్ / అమరావతి : తెలుగు రాష్ట్రాలకు తిప్పి తిప్పి చూస్తే జి కిషన్ రెడ్డి ఒక్కరే చుక్కానిలా కనిపిస్తున్నారు. ఆయనది బీజేపీతో నాలుగు దశాబ్దాల సుదీర్ఘమైన అనుబంధం. బీజేపీకి ఉమ్మడి ఏపీ ప్రెసిడెంట్ గా చేశారు. ఆరెస్సెస్ నుంచి వచ్చిన నేత. సుదీర్ఘకాలం పాటు పనిచేసిన తరువాత ఆయన ఇన్నాళ్ళకు మోడీ నాయకత్వాన సర్కార్ లో క్యాబినేట్ మంత్రి అయ్యారు. అయితే కిషన్ రెడ్డిది దూకుడు రాజకీయం కాదు మృదు స్వభావి. ఆయన మాటలు కూడా జోరు చేసేలా ఉండవు. ఆలోచింపచేస్తాయి. అయితే కిషన్ రెడ్డి మీద ఇపుడు కాషాయం పార్టీ అతి పెద్ద బరువుని పెట్టింది. అటు తెలంగాణాలో బీజేపీని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తేవడం తక్షణ కర్తవ్యం అయితే ఏపీలో కూడా వీలైతే పవర్ కి దగ్గరగానూ కాకుంటే రెండవ స్థానంలో తీసుకురావాల్సిన బృహత్తర బాధ్యత ఆయన భుజస్కందాలపైన బీజేపీ పెద్దలు పెట్టారు. దాంతో కిషన్ రెడ్డి మీద వత్తిడి పెరిగిపోతోంది. ఆయన అటు తెలంగాణాలో ఇటు ఏపీలో కూడా టూర్లు వేయాల్సి వస్తోంది. ఆయనకు బీజేపీ మాజీ ప్రెసిడెంట్ గా ఏపీ పార్టీకి ఏపీ జనాలకు తెలియడం ప్లస్ పాయింట్ అయితే ఏపీలో బీజేపీ ఇంకా సరైన శక్తి సంతరించుకోకపోవడం మైనస్‌గా ఉంది. ఇక బీజేపీ నాయకుల మాటలు లేస్తే మనిషిని కానట్లుగా ఉంటాయి. ఇక ఏపీ బీజేపీలో తెలుగుదేశం నుంచి వెళ్ళిన వారిది ఒక లైన్ మొదటి నుంచి పార్టీలో ఉన్నవారిది మరో లైన్ గా ఉంది. కొందరు వైసీపీ మీద సాఫ్ట్ కార్నర్ తో ఉన్నారని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఉన్న వారిలో భిన్న స్వరాలు ఉండడంతో కిషన్ రెడ్డి ఏపీకి వచ్చి ఎంతలా వచ్చి బిగ్ సౌండ్ చేసినా అక్కడితోనే ఆ వేడి చల్లారిపోతోంది. ఇక ఏపీ బీజేపీని జనసేనను కలిపి ఉంచేలా కార్యక్రమాలను కూడా ఇప్పటిదాకా చేపట్టకపోవడం ఒక వైఫల్యంగానే చూస్తున్నారు. ఈ నేపథ్యంలో తనకు అప్పగించిన మంత్రిత్వ బాధ్యతలను ఒక వైపు చూసుకుంటూ మరో వైపు తెలంగాణా ఏపీలో పార్టీని నడిపించడం కిషన్ రెడ్డికి కత్తి మీద సాము లాగే ఉంది అంటున్నారు. ఏది ఏమైనా బీజేపీ మిషన్ ని కిషన్ ఎంత మేరకు సక్సెస్ చేస్తారు అన్నది చూడాలి.

# సంపాదకీయం

## ప్రధాని ముఖ్యమంత్రులను సీబీఐ నేరుగా అరెస్టు చేయగలదా?

ప్రస్తుతం ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీబీఐ దేశంలో పలు కేసులను విచారిస్తున్నాయి. ఏపీ సీఎం వైఎస్ జగన్ పై అక్రమాస్తుల కేసును సీబీఐ విచారిస్తోంది. అలాగే జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ పై పలు కేసులున్నాయి. ఆయనపై ఈడీ కేసులు నమోదు చేసింది. అలాగే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పై ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి కేసులున్నాయి. దీనికి సంబంధించి సీబీఐ అధికారులు తాజాగా కేజ్రీవాల్ ను తొమ్మిది గంటలపాటు విచారించారు. ఆయనను మొత్తం 56 ప్రశ్నలు అడిగారు. ఈ నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ ను ఒక దశలో సీబీఐ అరెస్టు చేయొచ్చనే ప్రచారం కూడా సాగింది. అయితే తొమ్మిది గంటల విచారణ అనంతరం సీబీఐ అధికారులు ఆయనను అరెస్టు చేయకుండా వదిలిపెట్టేశారు. ఈ నేపథ్యంలో సీబీఐకి ముఖ్యమంత్రులను ప్రధానమంత్రిని నేరుగా అరెస్టు చేయగల అధికారం ఉందా? లేదా? అనే దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 135 ప్రకారం.. సివిల్ కేసుల్లో మాత్రం ప్రధానమంత్రి కేంద్ర మంత్రులు లోక్ సభ రాజ్యసభ సభ్యులు ముఖ్యమంత్రి శాసనసభ శాసన మండలి సభ్యులకు అరెస్టు నుంచి మినహాయింపు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. క్రిమినల్ కేసుల్లో మాత్రం ఈ సెక్షన్ వర్తించదని పేర్కొంటున్నారు. సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 135 ప్రకారం.. పార్లమెంట్ శాసన సభ శాసన మండలి సభ్యుడిని అరెస్టు చేయాలన్నా నిర్బంధించాలన్నా స్పీకర్ సభ చైర్మన్ ఆమోదం తప్పనిసరి. అంతేకాక.. పార్లమెంటు ఆవరణ శాసన సభ శాసన మండలి ఆవరణాల్లో ఏ సభ్యుడిని అరెస్టు చేయడం నిర్బంధించడం కుదరదని ఈ సెక్షన్ చెబుతోందని అంటున్నారు. ఇక క్రిమినల్ కేసులు అయితే ఎవరిని అయినా అరెస్టు చేయొచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అయితే ఆ సమాచారాన్ని స్పీకర్ లేదా చైర్మన్ కు ఇవ్వాల్సి ఉంటుందంటున్నారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి ముఖ్యమంత్రులు పార్లమెంటు శాసనసభల్లో ఏదో ఒకదానిలో సభ్యులే కాబట్టి వారిని కూడా అరెస్టు చేయొచ్చని పేర్కొంటున్నారు. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం.. రాష్ట్రపతి గవర్నర్ పదవిలో ఉండగా నిర్బంధించడం అరెస్టు చేయడం సాధ్యం కాదని వివరిస్తున్నారు. వారికి వ్యతిరేకంగా ఏ కోర్టు కూడా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని చెబుతున్నారు. వీరికి సివిల్ క్రిమినల్ కేసులలోనూ మినహాయింపు ఉందని పేర్కొంటున్నారు. రాష్ట్రపతి గవర్నర్ పదవిలో లేకపోతే లేదా పదవీకాలం ముగిస్తే వారిని అరెస్టు చేయొచ్చని వివరిస్తున్నారు.

# నిరుద్యోగుల సాపాట్లు

సిరిసిల్ల : ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు జిల్లాలోని నిరుద్యోగ యువత పుస్తకాలతో కుస్తీ పడుతోంది. త్వరలో వరుస నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉండటంతో పూర్తిస్థాయిలో సన్నద్ధతపైనే దృష్టి సారిస్తున్నారు. ఇదే క్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా నలుమూలల నుంచి ఉదయం ఏడు గంటలకే సిరిసిల్లకు చేరుకుంటున్నారు. రాత్రి 9 గంటల వరకు ఇక్కడే చదువుకుంటున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చేవారు ఉదయం వీలైతే బాక్సుల్లో భోజనం తీసుకొస్తున్నారు. వీలుకాని వారు రాత్రి ఇంటికి వెళ్లే వరకు చదువుతూ అర్ధాకలితోనే ఉంటున్నారు.జిల్లా గ్రంథాలయానికి నిత్యం 300 మంది పైనే నిరుద్యోగ యువత సన్నద్ధత కోసం వస్తున్నారు. వీరిలో చాలా మంది మారుమూల గ్రామాల నుంచి వచ్చేవారే ఎక్కువగా ఉన్నారు. రాబోయే రోజుల్లో పోలీసు ఉద్యోగాలకు శిక్షణ, బీసీ, ఎస్సీ అధ్యయన కేంద్రాల ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో నిత్యం పట్టణానికి వచ్చే అభ్యర్థుల సంఖ్య మరింత పెరగనుంది. వీరంతా ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణంలోనే ఉండి పుస్తకాలతో కుస్తీ పట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయమే ఇంటి వద్ద భోజనం సిద్ధం చేసుకోలేని పరిస్థితి ఉంటుంది. పట్టణానికి వచ్చాక హోటల్‌లో భోజనం చేస్తే రూ.80 నుంచి రూ.100 ఖర్చవుతుంది. పేదలకు ఇది సాధ్యం కాదు. డబ్బులు పెట్టి తినలేక సాపాట్లు పడుతున్నారు. పురపాలక శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలి సమీపంలో రూ.5లకు అన్నపూర్ణ పథకంలో భోజనం అందజేస్తుంది. ఇక్కడ రోజు కూలీలు, వస్త్రపరిశ్రమలోని కార్మికులు, ఆటోవాలాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు మధ్యాహ్నం కడుపునిండా భోజనం చేస్తున్నారు. నిత్యం 500 మందికి సరిపడా భోజనాలు అందిస్తున్నారు. గ్రంథాలయం వద్ద కూడా ఒక కేంద్రాన్ని నడిపితే తమ భోజనం పాట్లు తప్పుతాయని, కనీసం నాలుగైదు నెలలు తాత్కాలికంగా ఏర్పాటు చేసినా తమకు ఉపయుక్తంగా ఉంటుందని కోరుతున్నారు.

మంత్రి దృష్టికి...అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో పాల్గొనడానికి పట్టణానికి వచ్చిన మంత్రి కేటీఆర్ దృష్టికి గ్రంథాలయంలోని నిరుద్యోగ అభ్యర్థుల ఆకలి సమస్యను తీసుకెళ్లారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన మంత్రి కేటీఆర్ త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అలాగే పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచేలా కరీంనగర్‌కు చెందిన బుక్‌స్టాల్ నిర్వాహకులు గ్రంథాలయంలో పుస్తక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు వెయ్యికి పైగా చరిత్ర, వివిధ రకాల పోటీ పరీక్షలకు అవసరమైనవి ఉన్నాయి. అలాగే మనసున్న దాతలు ముందకొచ్చి మధ్యాహ్న భోజనం కూడా సమకూరిస్తే నిరుపేదల నిరుద్యోగులకు మేలు చేసినవారు అవుతారు.

సమయం కలిసివస్తుంది– శ్రీకాంత్, వేములవాడ

నేను గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నాను. ఉదయమే వేములవాడ నుంచి వస్తున్నాను. ఆ సమయంలో టిఫిన్ చేసి వస్తున్నాను. అన్నం వండుకునేందుకు మరింత సమయం పడుతుంది. మధ్యాహ్నం తిరిగి వెళ్లలేని పరిస్థితుల్లో పక్కన ఉన్న అన్నపూర్ణ భోజనం కేంద్రంలో రూ.5లకు భోజనం చేస్తున్నాం. ఇక్కడే భోజన వసతి ఏర్పాటు చేస్తే సమయం కలిసివస్తుంది.

భోజన వసతి కల్పించాలి– మహేష్, సిరిసిల్ల

జిల్లా న్యాయస్థానంలో టైపిస్టుగా పని చేస్తూనే గ్రూప్–1కు సిద్ధమవుతున్నాను. ఉద్యోగరీత్యా సిరిసిల్లకు వచ్చి ఉంటున్నాను. ఉదయం ఏడు గంటలకే వచ్చి కార్యాలయం తెరిచే సమయం వరకు చదువుకుంటున్నాను. కార్యాలయం ముగిశాక.. సెలవుదినాల్లోనూ ఇక్కడే చదువుకుంటున్నాను. ఇక్కడే భోజన వసతి కల్పిస్తే నాలాంటి వారికి ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది.

# నిర్ధారణ పరీక్షలకు విఘాతం



ఆదిలాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన వ్యాధి నిర్ధారణ పరీక్షల వ్యవస్థ నిర్వహణ సరిగా లేదు. ఇందులో మొత్తం 57 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయటానికి ఏర్పాట్లు చేశారు. రిమ్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలోని బయోకెమిస్ట్రీ పరీక్షలు చేసే ఆటో ఎనలైజర్ యంత్రం వారం కిందట పాడైంది. రిమ్స్‌లో ఉన్న మరో యంత్రం మూడు రోజులుగా మొరాయిస్తోంది. దీంతో నిర్ధారణ పరీక్షలన్నీ నిలిచిపోయాయి. జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల నుంచి వచ్చే నమూనాలకు, రిమ్స్‌లో రోగుల నుంచి సేకరించే నమూనాల నిర్ధారణ పరీక్షలు చేయలేకపోతున్నారు. బయోకెమిస్ట్రీ ఎనలైజర్ యంత్రం పని చేయక ఇందులో చేసే డయాబెటిక్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ టెస్ట్, రీనల్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, సిరం ఎలక్ట్రోలైట్స్, తదితర మొత్తం 32 రకాల నిర్ధారణ పరీక్షలు చేయడం లేదు. ప్రస్తుతం ఇతర యంత్రాలపై చేసే 25 రకాల పాథలాజీ పరీక్షలు, థైరాయిడ్ పరీక్షలు మాత్రమే జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి రిమ్స్‌లోనూ నెలకొంది. టీహబ్‌లో పని చేసే సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ల(పీహెచ్‌సీల నుంచి డిప్యూటేషన్‌పై పని చేసే వారిని)ను తొలగించి రిమ్స్‌లో పని చేసే వారితో పరీక్షలు చేయిస్తున్నారు. నిర్వహణ సరిగా లేకనే పరిస్థితి నెలకొందనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

సెల్ కౌంటర్‌దీ అదే పరిస్థితి..

రిమ్స్‌లోనూ రక్త నమూనాల సీబీపీ పరీక్షలు చేసే సెల్ కౌంటర్ మరమ్మతులకు గురైంది. రిమ్స్ పాథలాజీ విభాగంలో రెండు సెల్ కౌంటర్లలో రెండేళ్ల కిందటే మూలన పడగా రెండో సెల్ కౌంటర్ తరచూ చెడిపోతోంది. కొన్నాళ్లు పట్టణ పీహెచ్‌సీ నుంచి సెల్ కౌంటర్ తీసుకొచ్చి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం ఆ పీహెచ్‌సీ వారు ఆ యంత్రాన్ని తీసుకెళ్లటంతో పాత దానికి మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం అది మళ్లీ పాడైంది. దీంతో టీహబ్‌లోని సెల్ కౌంటర్ యంత్రంపైనే సీబీపీ పరీక్షలు చేస్తున్నారు.

పాడై వారం రోజులు..రిమ్స్‌లోని తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రం (టీహబ్) లో బయో కెమిస్ట్రీ పరీక్షలు చేసే యంత్రం ఇది. వారం రోజుల కిందట పాడైంది. రిమ్స్‌తోపాటు జిల్లాలోని 20 పీహెచ్‌సీల నుంచి వచ్చే నమూనాల నిర్ధారణ పరీక్షలు ఆగిపోయాయి.

రిమ్స్‌లోనూ మూడురోజులుగా అంతరాయం

బయో కెమిస్ట్రీ విభాగంలోని ఆటో ఎనలైజర్ యంత్రం మూడు రోజులుగా మొరాయిస్తోంది. ఈ విభాగంలో కేవలం రెండు ఏసీలు మాత్రమే ఉండటంతో ఎండ వేడిమికి తరచూ యంత్రం పని చేయకుండా మొరాయిస్తున్నట్లు సమాచారం. దీంతో నిత్యం 1,500లకు పైగా జరిగే నిర్ధారణ పరీక్షలు నిలిచిపోయాయి.

కేవలం 600 పరీక్షలే..ఇది రిమ్స్‌లోని బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లోని చిత్రం. నిర్ధారణ పరీక్షలు చేసే ఆటో ఎనలైజర్ యంత్రం మొరాయించటంతో సిబ్బందే నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. దీంతో రోజంతా కేవలం 500 నుంచి 600 నిర్ధారణ పరీక్షలు మాత్రమే జరుగుతున్నాయి.

మరమ్మతులు చేయిస్తాం

ఆటో ఎనలైజర్లు సరిగా పని చేసేలా సంబంధిత కంపెనీ ఇంజినీర్లకు సమాచారం అందించి వీలైనంత తొందరగా మరమ్మతులు చేయిస్తాం. నిర్వహణ తీరును సైతం మెరుగుపర్చటానికి చర్యలు తీసుకుంటాం.

# ఆదాయంపైనే గురి.. వసతులు హారీ

నిర్మల్ : ఉమ్మడి జిల్లా పరిధిలో పెద్దదైన స్థానిక ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నిర్వహణలోపంతో కొట్టుమిట్టాడుతోంది. 1977లో ప్రారంభమైన ఈ బస్టాండ్‌లో కనీస మౌలిక వసతుల్లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలి కాలంలో పదేపదే అదనపు ఛార్జీలు విధిస్తున్న అధికారులు సౌకర్యాల కల్పనను మాత్రం విస్మరించారు.

పెరిగిన సెస్..ప్రయాణికుల సౌలభ్యం కోసం ప్రయాణ ప్రాంగణంలో కుర్చీలు, తాగునీరు, ఫ్యాన్లు తదితర వసతులు కల్పించేందుకు, నిర్వహించేందుకు గాను ప్రత్యేకంగా సెస్ రుసుమును వసూలు చేస్తున్నారు. గతంలో ఇది రూ.1 ఉండేది. పల్లెవెలుగుకు రూ.1, ఎక్స్‌ప్రెస్ ఆపైన ఉండే బస్సులకు రూ.5 చొప్పున పెంచారు. దాదాపు నెల రోజులుగా ఇది అమలవుతోంది. టికెట్ తీసుకునే ప్రతి ప్రయాణికుడు ఈ రుసుము తప్పనిసరిగా చెల్లించాలి. కేవలం సెస్ ఛార్జీల రూపంలోనే నిర్మల్ డిపోకు ప్రతిరోజూ దాదాపు రూ.2 లక్షల ఆదాయం సమకూరుతోంది. నెలకు రూ.60 లక్షలు. ఈ డబ్బులతో ప్రాంగణంలో సౌకర్యాలు మెరుగుపర్చడం పెద్దగా కష్టమేమీ కాదు. అయినా క్షేత్రస్థాయిలో అవస్థలు ఎదుర్కొంటున్నారంటే అధికారులు విఫలమవుతుండటమో, లేక వచ్చిన డబ్బులను సంస్థ ఇతర అవసరాలకు వినియోగించడమో జరుగుతోందనేది సుస్పష్టం.

సమస్యలతో సహవాసం..

సుమారు 45 సంవత్సరాల కిత్రం అందుబాటులోకి వచ్చిన ప్రయాణప్రాంగణం దినదినాభివృద్ధి చెందాలి. కానీ, ప్రయాణికులు, బస్సు సర్వీసుల సంఖ్య పెరుగుతున్నా ప్రయాణికులను అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు మాత్రం ఇంకా అందుబాటులోకి రావడం లేదు. ఇప్పటికీ సామగ్రి భద్రపర్చేగది లేదు. తాగునీరు, మూత్రశాలలకు అవస్థలే. వచ్చిన ప్రయాణికులు ఇక్కట్లతో సహవాసం చేయాల్సి వస్తోంది.

తాళం వేసి ఉన్న గది

ఇటీవల ఓ ఆసుపత్రి సౌజన్యంతో ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక గది ఇది. చంటిపిల్లలకు పాలిచ్చేందుకు తల్లులకు ఇబ్బందులు ఏర్పడొద్దని ఈ ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ గది తాళం వేసిఉంటోంది.

మూత్రశాలలకు వెళ్లే దారేది..?

ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన మూత్రశాలలను కొద్దిరోజుల క్రితం మూసేశారు. టెండర్ ప్రక్రియ పూర్తవకపోవడంతో దాన్ని ఎవరికీ కేటాయించలేదు. కావాల్సిన అద్దె లభించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే.. ఖాళీగా వదిలేసే బదులు, కాస్త అద్దె తక్కువైనా ఎవరికో ఒకరికి కేటాయిస్తే నిర్వహణ జరిగి అందరికీ సౌలభ్యంగా ఉంటుందని ప్రయాణికులు చెప్తున్నారు

ఇదీ నిర్వహణ తీరు..

ఎండలు మండుతున్నాయి. అందరూ గుక్కెడు నీటికోసం అల్లాడుతుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం దాతల సాయంతో కొద్దిరోజుల క్రితం నీటి ట్యాంకును ఏర్పాటుచేశారు. ప్రారంభంలో బాగానే ఉన్నా.. కొద్దిరోజుల అనంతరం పరిస్థితి ఎప్పటిలాగే మారింది. నిర్వహణ లేక తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ప్రాంగణం ఆవరణలో చెత్త

ప్రయాణ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే కనిపించే దృశ్యమిది. చెత్తచెదారం పేరుకుపోయింది. సకాలంలో తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. పలువురు బహిరంగ మూత్రవిసర్జన చేస్తున్నారు. గతంలో మున్సిపల్ వారు సేకరించిన చెత్తను అక్కడున్న స్థలాన్ని పూడ్చేందుకు గాను బస్టాండ్ ఆవరణలోనే పడేశారు.

# విధులు అక్కడ.. వేతనం ఇక్కడ..

మంచిర్యాల : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పనితీరు అస్తవ్యస్తంగా తయారైంది. మంచిర్యాలకు శాశ్వత జిల్లా అదనపు అధికారిగా డా.శ్రీరాంను నియమించినా ఇక్కడ విధులు నిర్వర్తించడంలేదు. పని ఉత్తర్వుల పేరిట జయశంకర్ భూపాలపల్లిలో కొనసాగుతూ వేతనం మాత్రం మంచిర్యాల నుంచే తీసుకుంటున్నారు.

డిప్యూటీ సివిల్ సర్జన్లే.. జిల్లా అధికారులు

వైద్యారోగ్యశాఖ జిల్లా బాధ్యతలు తప్పనిసరిగా సివిల్ సర్జన్‌స్థాయి వ్యక్తికి అప్పగించాలి. జిల్లాకు మొదటి అదనపు వైద్యాధికారిగా నియామకమైన డా.భీష్మ మాత్రమే సీఎస్ హోదాలో పని చేశారు. ఎక్కువ కాలం చేసింది కూడా ఆయనే. తన బదిలీ తర్వాత దాదాపు రెండేళ్లపాటు డీసీఎస్‌లతో నెట్టుకొచ్చారు. రెండు సంవత్సరాల్లో సుమారు నాలుగుసార్లు అధికారులను మార్చారు. గతేడాది ఏప్రిల్‌లో ప్రభుత్వం పలువురికి సీఎస్‌గా పదోన్నతి కల్పించడంతో మహబూబాబాద్‌లో డీసీఎస్‌గా కొనసాగుతున్న డా.శ్రీరాం మంచిర్యాల అదనపు వైద్యాధికారిగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన





కొద్ది రోజుల్లోనే ఇక్కడ పనిచేయడం ఇష్టంలేకనో.. ఒత్తిడి తట్టులేకనో.. మరే ఇతర కారణాలతో గానీ సెలవుపెట్టి వెళ్లిపోయారు.

సివిల్‌సర్జన్‌గా పదోన్నతితో జిల్లా అదనపు అధికారిగా బాధ్యతలు చేపట్టిన డా.శ్రీరాం ప్రస్తుతం విధులు మరోచోట నిర్వర్తిస్తున్నారు. సాధారణ బదిలీ అయ్యే వరకు ఆయన కేటాయించిన పోస్టులోనే కొనసాగాలి. కానీ డీహెచ్ నుంచి తనకున్న పలుకుబడితో పని ఉత్తర్వుల పేరిట బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లిజిల్లాలో తాత్కాలిక వైద్యాధికారిగా కొనసాగుతున్నారు. కానీ వేతనం మాత్రం మంచిర్యాల నుంచి పొందుతున్నారు. ప్రతినెల హాజరుపట్టిక భూపాలపల్లి నుంచి రావడం, ఇక్కడ నమోదు చేసుకుని వేతనానికి సంబంధించిన లెక్కలు చేసి ఖజానా శాఖకు పంపడం జరుగుతోంది. ప్రతినెల ఇదే తంతు. దీంతో జిల్లాలో తప్పని పరిస్థితుల్లో అర్హతలేని వారిని(డీసీఎస్) వైద్యాధికారిగా నియామకం చేసి కొనసాగించాల్సి వస్తోంది. తాత్కాలిక అధికారులను కేటాయిస్తుండటంతో తరచూ మార్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఏడాది వ్యవధిలోనే నలుగురిని మార్చడం గమనార్హం. ఇటీవల తాత్కాలికంగానైనా సీఎస్ స్థాయి వ్యక్తికి బాధ్యతలు అప్పగించడంతో శాఖ గాడిలో పడుతుందని అనుకున్నారు. విధుల్లో చేరినా కొద్దిరోజుల్లోనే అకస్మాత్తుగా ఆయనను తొలగించారు. దీంతో జిల్లా ఆరోగ్యశాఖకు మళ్లీ డీసీఎస్ స్థాయి వ్యక్తి దిక్కయ్యారు. ఉన్నతాధికారులు చొరవ చూపి జిల్లా నుంచే వేతనం పొందుతున్న శాశ్వత అధికారిని తిరిగి జిల్లాకు తీసుకురావడమో లేదా ఆయనను పూర్తిగా బదిలీచేసి శాశ్వత అధికారిగా మరొకరిని నియమించడమో చేయాలని ఆ శాఖ సిబ్బంది కోరుతున్నారు.

# అభయారణ్యంలో ప్లాట్ల దందా..

ఇంద్రవెల్లి: జిల్లాలోని ఏజెన్సీ (అభయారణ్య)ప్రాంతాల్లో గిరిజనేతరులు ఇష్టారీతిన నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. ప్రధానంగా ఇంద్రవెల్లి, ఉట్నూరు ప్రాంతాల్లో విచ్చలవిడిగా దందా సాగుతోంది. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి అవసరాలకు అధిక వడ్డీలకు డబ్బులను రుణంగా అందజేసి.. వారు తీర్చలేని పరిస్థితుల్లో ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతోపాటు, వారి స్థలాల్లో భారీ భవంతుల నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇళ్లకు రైతుబంధు డబ్బులు..వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మడంతో.. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు భవనాలను నిర్మించుకుంటున్నారు. వీటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. రెవెన్యూ రికార్డులో సర్వే నెంబరులో రైతుల పేరిట నమోదై ఉండటంతో యథావిధిగా రైతు బంధు డబ్బులను తీసుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల అనుమతి లేకుండా రెండు, మూడు అంతస్తుల భవనాల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారు.

నాలా చట్టానికి తూట్లు

వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడానికి నాలా(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్) చట్టం ప్రకారం గతంలో భూమి విలువలో 9 శాతం ఉండగా, తెలంగాణ ప్రభుత్వం ఇటీవల దీనిని కేవలం మూడు శాతం చెల్లించేలా సడలింపునిచ్చింది. అయినా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ పన్ను చెల్లించడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వం రూ.లక్షల్లో ఆదాయాన్ని నష్టపోతోంది.

యథేచ్ఛగా స్థిరాస్తి వ్యాపారం



చిత్రంలో కనిపిస్తున్న భూమి గత ఖరీఫ్ సీజన్ వరకు వ్యవసాయ భూమి. ఇంద్రవెల్లి మండలం నుంచి హర్కపూర్‌కు వెళ్తున్న మార్గంలో రహదారికి కుడి పక్కన ఉన్న భూమిని ప్రస్తుతం ప్లాట్లుగా మార్చేశారు. గిరిజనేతరులు కొందరు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వాటిని విక్రయిస్తున్నారు. గిరిజనుల భూములను కూడా వారు వేలాది ప్లాట్లను తయారు చేసి అందినకాడికి దండుకుంటున్నారు. ఈ రహదారికి అరకిలోమీటరు దూరంలో కైలాస్‌నగర్ గ్రామం వద్ద రహదారికి ఇరువైపులా ప్లాట్లు వేసి అమ్మేశారు. ఉట్నూరు మండలం ఎందా గ్రామ శివారులో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఎడమ వైపు వ్యవసాయ పొలంలో ప్లాట్లుగా మార్చి అమ్ముతున్నారు. ఇక్కడ ఒక ప్లాట్ ధర రూ.16 లక్షలకు పైగానే అమ్ముతున్నారని ప్రచారం జరుగుతోంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం– ముంజం సోము, తహసీల్దార్ ఇంద్రవెల్లి

ప్రభుత్వ అనుమతి లేకుండా పంట పొలాల్లో ప్లాట్లు వేసి విక్రయించడం చట్టరీత్యా నేరం. పంట చేలో ప్లాట్లు వేసి అమ్మిన వాటికి రైతు బంధు పథకం తీసుకునే రైతుల వివరాలను సేకరించి వారిపై చట్టం ప్రకారంగా చర్యలు తీసుకుంటాం.

# పాఠ్యపుస్తకాలు వచ్చాయ్..!

మానుకోట : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 2023-24 విద్యాసంవత్సరంలో ముందుగానే పుస్తకాలు సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇన్నాళ్లు బడులు పునఃప్రారంభం తరువాత విడతలవారీగా సరఫరా చేయడంతో బోధనపై ప్రభావం పడేది. రాబోయే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఈ తరహా కష్టాలు దూరం చేయాలని నిర్ణయించింది. ఈమేరకు ముందుగానే పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత విద్యాసంవత్సరం ముగుస్తున్న సమయంలోనే జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలోని కేసముద్రం పాఠ్యపుస్తకాల గోదామునకు వివిధ తరగతుల పాఠ్య పుస్తకాలు ఆర్టీసీ కార్గో ద్వారా సరఫరా అవుతున్నాయి. ఇప్పటికే 1,39,910 పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఈ గోదాం ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రెడ్డికు తెలిపారు.



ఈ గోదామును జిల్లా విద్యాశాఖాధికారి పి.రామారావు సందర్శించి ఇప్పటివరకు వచ్చిన పాఠ్యపుస్తకాల వివరాలు తెలుసుకున్నారు.

సకాలంలో పంపిణీ చేయాలనే..గత విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమ తరగతులను హడావుడిగా ప్రారంభించారు. పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించలేకపోయారు. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి ఆ ఇబ్బంది తలెత్తకుండా ముందుగానే అన్ని తరగతుల అన్ని టైటిళ్ల పాఠ్యపుస్తకాలను పంపించే ప్రయత్నం జరుగుతోంది. జిల్లాకు గత సంవత్సరం 6,43,750 పాఠ్యపుస్తకాలను సరఫరా చేశారు. ఈసారి ఇంకో ఆరు శాతానికి పైగా పాఠ్య పుస్తకాలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని పాఠశాలల్లోని తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్య వివరాలు యూడైస్ ప్రకారం చైల్డ్ ఇన్‌ఫ్లో వెబ్సైట్లో ఉంటాయని వాటి ప్రకారమే అవసరమైన పాఠ్యపుస్తకాలను రాష్ట్ర విద్యాశాఖ పంపించనుంది. జిల్లాకు అవసరమైన పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో త్వరలోనే గోడౌన్‌లకు సరఫరా కానున్నాయని భావిస్తున్నారు.

# ధర దిగాలు.. రైతు కుదేలు

జగిత్యాల : పసుపు, మక్కలు, పత్తి, కందులు, సన్నధాన్యం, మామిడి... ఇలా పంట ఏదైనా విక్రయ సమయంలోనే ధరలు అమాంతం పడిపోవటంతో అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. జిల్లాలో ప్రధానంగా సాగుచేసిన చాలాపంటల్లో ప్రస్తుతం ధరలలేమి రైతులను ఆర్థిక నష్టాలకు గురిచేస్తోంది. జిల్లాలోని రైతులు సంప్రదాయ ఇంటిపంటగా 35 వేల ఎకరాల్లో సాగుచేసిన పసుపులో ఈసారి అధిక వర్షాలతో దుంపకుళ్లు, దుంపఈగ, దుంపతొలుచు పురుగు, మర్రాకు తెగుళ్ల ఆశించి సగటు దిగుబడులు 30 శాతానికిపైగా తగ్గాయి. కనీసం ధరపెరిగి లాభిస్తుందని ఆశించినా అన్నదాతలకు నిరాశే ఎదురవుతోంది.

ఎండుకొమ్ములకు పదేళ్లకిందట క్వింటాలుకు రూ.15 వేలకు పైగా ధరలు పలకగా ప్రస్తుతం రూ.3 వేల నుంచి 5 వేల వరకే ధరలుండటంతో కనీసం పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఈ యాసంగిలో 27 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా గతనెలలో క్వింటాలు మక్కలకు రూ.2,300 వరకు ధర పలికింది. ప్రస్తుతం రూ.1,800 సగటుకు పడిపోయింది. అలాగే సన్నధాన్యం ధరలు కూడా క్వింటాలుకు రూ.400 వరకు తగ్గగా పత్తి ధర క్వింటాలుకు రూ.2 వేలకుపైగా తగ్గింది. కందుల్లోనూ సరాసరి ధర క్వింటాలుకు రూ.1,200 తగ్గగా ధరలు అమాంతం తగ్గటంతో మామిడి రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా ప్రభుత్వం పసుపు, మక్కలు, కందులను మార్క్‌ఫెడ్



ద్వారా కొనుగోలు చేయాలని, ఇతర ఉత్పత్తుల్లోనూ ఎగుమతి అవకాశాలను పెంచి ధరల్లో స్థిరత్వం తీసుకురావాలని జిల్లాలోని కర్షకులు కోరుతున్నారు.

విక్రయించే సమయంలోనే..కందుల రమేశ్, రైతు, కిష్టంపేట

నేను జగిత్యాల బీటుకు మక్కలను తీసుకురాగా నిరుటితో పోలిస్తే క్వింటాలుకు రూ.200కు పైగా తక్కువ ధర వచ్చింది. నిరుటితో పోలిస్తే పెట్టుబడి పెరగగా ఇలా ధర తగ్గితే మాకు లాభం కాదు కదా కనీసం పెట్టుబడి చేతికందదు.

పసుపు పరిస్థితి దయనీయంచిట్నేని రాజవ్వ, రైతు, రాగోజీపేట

పసుపుపంటను రెండు సీజన్లపాటు సాగు చేస్తాం. పెట్టుబడి ఎకరాకు రూ.లక్ష వరకు ఉంటుంది. మూడేళ్లకిందటికన్నా క్వింటాలుకు రూ.3 వేల వరకు ధరలు తగ్గాయి. క్వింటాలుకు కనీసం రూ.10 వేల ధరుంటేనే గిట్టుబాటవుతుంది.

ప్రభుత్వం కొనుగోలు చేస్తేనే..వెంకటేశ్, రైతు, హన్మాజీపేట

ప్రభుత్వం కొనుగోలు చేస్తేనే మార్కెట్లో పోటీపెరిగి అన్ని పంటల్లో ధరలు తగ్గకుండా ఉంటాయి. ప్రతి పంటలోనూ కనీస పెట్టుబడి వచ్చేలా ధరలను పెంచి అమలు చేయాలి. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

# గోడు వినండి.. గొంతు తడపండి



ములుగు : ఇంటింటికీ స్వచ్ఛమైన తాగు నీరందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ప్రజలకు వరం లాంటిదే. కానీ అసంపూర్తి పనులు, పైపుల లీకేజీలు, అప్రకటిత విద్యుత్తు కోతలు, సకాలంలో సరఫరా జరగక ప్రజలు తాగునీటికై ఇబ్బంది పడుతున్నారు. లీకేజీల కారణంగా కలుషిత తాగు నీటితో అనారోగ్యాలకు గురవుతున్నారు. వేసవి నేపథ్యంలో తాగు నీటి సమస్యపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు జాప్యం చేస్తున్నారు. పైపులైన్ల లీకేజీ, చేతిపంపుల మరమ్మతు లాంటి పనులను సైతం పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంటోంది. 52 గ్రామాలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని జిల్లా అధికారులు గుర్తించారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్యపై పరిశీలనాత్మక కథనం...

ములుగులో వీవర్స్ కాలనీ వెళ్లే క్రాసు రోడ్డు వద్ద చేతిపంపు సుమారు నెల రోజుల క్రితం పాడవ్వడంతో నిరుపయోగంగా మారింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వచ్చే నీరు రెండ్రోజులకోసారి వస్తోంది. గతంలో నీటి సమస్య వచ్చిన ప్రతిసారి చేతి పంపు ఉపయోగపడేది. ప్రస్తుతం అది మరమ్మతుకి గురవ్వడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. చేతిపంపును మరమ్మతు చేయించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన స్పందన లేదని వారు చెబుతున్నారు. త్వరితగతిన తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

ఏటూరునాగారంలో తాగునీటికి కటకట

ఏటూరునాగారం మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. జలసంపద పుష్కలంగా ఉన్నా మండలంలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి ఇక్కట్లు తప్పట్లేదు. మిషన్ భగీరథ నీళ్ల సరఫరా క్రమబద్ధంగా లేకపోవడంతో ప్రజల్లో ఆయోమయ పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం, తాళ్లగడ్డ, క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో భగీరథ నీళ్లు పది రోజులు వస్తే మరో పది రోజులు రావట్లేదు. గతంలో భగీరథ నీళ్లు వస్తున్నాయనే ఉద్దేశంతో ఉన్న చేతి పంపులను వాడటం మానేశారు. దీంతో అవి పనిచేయకుండా పోయాయి. ప్రస్తుతం భగీరథ నీరు రాక, చేతిపంపులు పనిచేయక ప్రజలు తాగునీటికై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై మిషన్ భగీరథ ఏఈ మోహన్‌తో మాట్లాడగా సమస్య తమ దృష్టికి రాలేదని, వెంటనే మా సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.

బోరుబావులను ఆశ్రయిస్తున్న గ్రామస్థులు

మండలంలోని పొట్లాపూర్ గ్రామంలో వేసవి కాలంలో బోరుబావులు ఎండిపోతున్నాయి. మిషన్ భగీరథ నీరు పూర్తిగా రావడంలేదు. కొన్ని వీధులకు పైపులైన్లు వెయ్యలేదు. చేతిపంపులు సైతం పనిచేయకపోవడంతో గామస్థులు తాగునీటికై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సర్పంచి లత, పాలడుగుల రాకేష్, లౌడియ విజేందర్ తమ బోరుబావుల నుంచి గ్రామానికి తాగునీటిని అందిస్తున్నారు.

పది రోజులుగా నీళ్లు రావడం లేదు....

-తమ్మళ్ల మమత, క్రాస్‌రోడ్డు

పది రోజులుగా తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. వేరే ప్రాంతాలకు వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఫిర్యాదు చేద్దామంటే సంబంధిత అధికారులు అందుబాటులో ఉండట్లేదు. తాగునీటి సమస్యను గుర్తించి అధికారులు వెంటనే పరిష్కరించాలి.

సమస్యాత్మక గ్రామాల్లో చర్యలు తీసుకుంటున్నాం- సుభాష్ ఈఈ మిషన్ భగీరథ

జిల్లా వ్యాప్తంగా 52 గ్రామాలను తాగునీటి సమస్య ఉన్నవాటిగా గుర్తించాం. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఈ గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.2.89 కోట్లతో ప్రతిపాదనలు చేసి 28 గ్రామాల్లో సమస్య లేకుండా చేశాం. మిగిలిన గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. పైపులైన్‌ల లీకేజీలను కూడా అరికడుతున్నాం. ప్రత్నామ్నాయ ఏర్పాట్లలో భాగంగా జిల్లాలో 21 బోర్లు, పైపులైన్లు వేసేందుకు నిర్ణయించాం. అందులో 10 బోర్లు పూర్తయ్యాయి. త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

# తాగునీటి సరఫరా అంతంతే..!



ములుగు : 'అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లుగా తయారైంది నగరంలో తాగునీటి సరఫరా తీరు. ధర్మసాగర్ చెరువులో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. సరిపడా తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలు, ప్రధాన, అంతర్గత పైపులైన్లు, సర్వీస్ రిజర్వాయర్లు(వాటర్ ట్యాంకులు) ఉన్నప్పటికీ నీరెందుకు ఇవ్వడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం నగరంలో నిత్యం తాగునీటి సరఫరాకు గ్రేటర్ వరంగల్, పబ్లిక్‌హెల్త్ ఇంజినీర్లు మల్లగుల్లాలు పడుతున్నారు. సరఫరా సాధ్యాసాధ్యాలను హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు విశ్రాంత సీఈ రవికుమార్ సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. నగరంలోని 66 డివిజన్లలో 90 శాతం కాలనీలకు రోజూ నల్లా నీళు వస్తున్నాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మరోలా ఉంది. 40-50 శాతం కాలనీలకు రోజూ, మిగిలిన 50 శాతం కాలనీలకు దినం విడిచి దినం సరఫరా జరుగుతుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలున్నాయని తెలిసింది. నగరంలో 66 డివిజన్లలో తాగునీటి సరఫరాను నాలుగు జోన్లుగా విభజించారు.

హనుమకొండ ప్రాంతంలో..హనుమకొండ వడ్డేపల్లి జోన్ పరిధిలో 70-75 శాతం నిత్యం నీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాజీపేట విష్ణుపురి, ఎఫ్‌సీఐ రిజర్వాయర్ల పరిధిలో దినం విడిచి దినం సరఫరా అవుతుందంటున్నారు. పరిశీలిస్తే కాజీపేట దర్గా, ప్రశాంత్‌నగర్, సోమిడి, డీజిల్ కాలనీ, బాపూజీనగర్, హనుమకొండ వడ్డేపల్లి, ఎన్జీవోస్ కాలనీ, జులైవాడ, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంది. హనుమకొండ కేయూసీ జోన్ పరిధిలో 24 ట్యాంకులున్నాయి. విద్యారణ్యపురి, ముచ్చర్ల రిజర్వాయర్లు తప్ప మిగిలిన వాటిలో రోజూ నీటి సరఫరా ఉందంటున్నారు. విలీన గ్రామాలు, నయీంనగర్, కొత్తూరుజెండా, రెడ్డికాలనీ, పోచమ్మకుంట, ఈద్గా తదితర ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది.

వరంగల్‌లో.. వరంగల్ దేశాయిపేట జోన్ పరిధి చాలా పెద్దది. 70-75 శాతం కాలనీలకు ప్రతిరోజు, మిగిలిన 25 శాతం దినం విడిచి దినం నీటి సరఫరా చేస్తున్నట్లుగా ఇంజినీర్లు చెబుతున్నారు. లేబర్ కాలనీ, ఎస్సార్టీ కాలనీ, గొర్రెకుంట కీర్తినగర్ రిజర్వాయర్ల పరిధిలోనే సమస్యలున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎల్బీనగర్, కాశీబుగ్గ, అబ్బనికుంట, గిర్మాజిపేట, జీఆఆర్‌గుట్ట, మండిబజారు, మట్టెవాడ, రామన్నపేట, పాపయ్యపేట, సంతోషిమాత కాలనీతో పాటు విలీన గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. కొన్ని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందిస్తున్నారు.

అండర్ రైల్వేగేటు జోన్ పరిధిలో గత నాలుగైదేళ్లుగా రోజూ నల్లా ఇచ్చారు. రెండు, మూడు నెలలుగా పరిశీలిస్తే దినం విడిచి దినం సరఫరా జరుగుతుంది. పాత పైపులైన్లు, మిషన్ భగీరథ పైపులైన్లకు వేర్వేరుగా సరఫరా చేస్తున్నారు. ధర్మసాగర్ ఫిల్టర్‌బెడ్ నుంచి 60 మిలియన్ లీటర్ ఫర్ డే(ఎంఎల్‌డీలు) క్లియర్ వాటర్ ఇస్తున్నారు. కడిపికొండ, అమ్మవారిపేట వద్ద ప్రధాన పైపులైన్ వాల్వ్ ఆపరేటింగ్‌లో లోపం ఉంది. దీంతో వాటర్ ట్యాంకులు నిండటం లేదు. ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, శాంతినగర్, శివనగర్, ఖిలావరంగల్ కోట, చింతల్, పుప్పాలగుట్టతో పాటు విలీన గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది.

క్షేత్రస్థాయిలో సమస్యలివే..కాలనీలకు నీటి సరఫరా వాల్వులు తిప్పేందుకు ఉద్యోగుల కొరత ఉంది. సర్వీస్ రిజర్వాయర్ల పంపింగ్ షెడ్యూల్ లేదు. కాలనీల్లో లీకేజీలు ఎక్కువగా ఉన్నాయి. మిషన్ భగీరథ కనెక్షన్ల ద్వారా నీటి వృథా ఎక్కువగా ఉంది. కొన్ని కాలనీలకు ఇంత వరకు నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. చేతి పంపులు, మినీ స్టాటిక్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయి. లైన్లపై భారం పెరిగింది. ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోవడం లేదు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం- ప్రవీణ్‌చంద్ర, పర్యవేక్షక ఇంజినీర్, నీటి సరఫరా విభాగం

నగరంలోని అన్ని డివిజన్ల పరిధిలోని కాలనీలకు 90 శాతం తాగునీటి సరఫరా జరుగుతుంది. చిన్నచిన్న సమస్యలున్నాయి. వాటిని కూడా అధిగమిస్తాం. లీకేజీలు యుద్ధప్రాతిపదికన అరికడుతున్నాం. వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

శుద్ధ జలాలు అందని ద్రాక్ష

నర్సంపేట పట్టణంలో పాత, కొత్తగా వెలిసిన ఎనిమిది కాలనీల్లో ప్రజలకు శుద్ధ జలాలు అందడం లేదు. దీంతో ఆయా కాలనీల్లోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. 40 వేలకు పై చిలుకు జనాభా కలిగిన నర్సంపేట పట్టణంలో గత రెండున్నరేళ్ల నుంచి మిషన్ భగీరథ నీళ్లను పాత పైపులైన్లకు కనెక్షన్ ఇచ్చి సరఫరా చేస్తున్నారు. ఇప్పటి వరకు పైపులైన్లు లేని కొత్త కాలనీలు, కొన్ని పాత కాలనీల్లో ప్రజలకు శుద్ధ జలాల అందడం లేదు. రోజుకు 50 లక్షల లీటర్ల నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నా.. పూర్తిస్థాయిలో పైపులైన్ పనులు కానందున నీటికి ఇబ్బందులు తప్పడం లేదు.

రెండు నెలల్లో కనెక్షన్లు ఇస్తాం- వెంకటస్వామి, పుర కమిషనర్, నర్సంపేట

పట్టణంలో మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణ పనులు 85 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులతో పాటు ప్రధాన పైపులైన్ పనులు పూర్తి చేసి రానున్న రెండు నెలల్లో ఇంటింటికి శుద్ధ జలాలు అందిస్తాం.

# క్రీడా ప్రాంగణ ఏర్పాటులో నిర్లక్ష్యం

జగిత్యాల : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం చేరడం లేదు. పురపాలికల్లోని చిన్నారులు ఆటలు ఆడుకునేందుకు వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మెట్‌పల్లి బల్దియా పరిధిలోని 26 వార్డుల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రగతి నిధులు రూ.30 లక్షలు కేటాయించారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాల కొరతతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పటివరకు 13 మాత్రమే ఏర్పాటు చేశారు.

అవగాహన కరవు

ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణంలో వాలీబాల్ కోర్ట్, ఖోఖో, కబడ్డీ కోర్టులతో పాటు పలు రకాల వ్యాయామ పరికరాలు, లాంగ్‌జంప్, తదితర వాటిని




ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. స్థలాల కొరతతో పరికరాలు బిగించి వదిలేస్తున్నారు. ఆయా వార్డులలో ఏర్పాటు చేసిన ప్రాంగణాలపై అవగాహన కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

గేట్‌వాల్వ్ గుంత

పట్టణంలో ఫిల్టర్‌బెడ్ వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో సగం వరకు ఫిల్టర్‌హౌజ్‌లు, గేట్‌వాల్స్, పెద్ద సంపు, ఉద్యోగులు ఉండే మూడు గదులు ఉంటాయి. ఇవన్నీ ఉండగా ఇక్కడే క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. ఇందులో వాలీబాల్ కోర్ట్ ఏర్పాటు చేశారు. దీనిని ఆనుకునే మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ గుంత ఉండడంతో ఎలా ఆడాలని క్రీడాకారులు వాపోతున్నారు. కళానగర్‌లోని సరస్వతి శిశుమందిరం ప్రైవేటు పాఠశాలలో క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ముగిసిన తర్వాత యాజమాన్యం గేట్‌కు తాళం వేసి వెళ్తారు. ఈ విషయంపై బల్దియా ఏఈ అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా క్రీడాప్రాంగణాలను వార్డుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్థలాల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, స్థలాలు ఉన్నచోట్ల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# తీరనున్న తాగునీటి సమస్య


కరీంనగర్ : కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, విలీన కాలనీల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళికలు చేశారు. జిల్లాలో కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలున్నాయి. రెండు పురపాలికలు కొత్తగా ఏర్పాటు కావడంతో, మిగతా వాటిల్లో సమీప గ్రామాలను విలీనం చేయడంతో తాగునీటికి కటకట తప్పడం లేదు. కొత్తపల్లి మున్సిపాలిటీలో నల్లానీరు తాగడానికి కూడా పనికి రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. తాగునీటి వసతి మెరుగుపర్చాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నప్పటికీ నిధులు లేక ఇప్పటికీ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

భగీరథలో జాప్యంవేసవిలో మున్సిపాలిటీలు, విలీన కాలనీల్లో రూరల్ మిషన్ భగీరథ కింద తాగునీరు రాక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో 10 లక్షల లీటర్ల ట్యాంకు గంటన్నరలో నిండుతుండగా, రూరల్ మిషన్ భగీరథ ద్వారా నిర్మించిన లక్ష లీటర్ల ట్యాంకు 20 గంటలు పడుతుంది. దీంతో నీటి సరఫరాకు జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల నగరపాలిక రూ.5.50 కోట్లతో కొత్తగా తాగునీటి పైపులైను వేయగా అత్యధిక ప్రాంతాల్లో పనులు పూర్తి చేసి నీటి సరఫరాను మెరుగుపర్చారు. మిగతా భాగంలో పనులు కొనసాగుతు న్నాయి.

అంచనాలు తయారు

రోజు తాగునీరు సరఫరా చేసేందుకు అమృత్ కింద విలీన కాలనీలు, కొత్త మున్సిపాలిటీల్లో పైపులైన్లు, రిజర్వాయర్లు విస్తరించేందుకు ప్రతిపాదనలు చేశారు. రానున్న పాతికేళ్ల జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రజారోగ్యశాఖ అంచనాలు తయారు చేసింది. ప్రభుత్వం ద్వారా అనుమతి రాగానే టెండర్లు పిలిచే అవకాశముంది. ఈ పనులు ప్రారంభించిన ఏడాదిలోగా పూర్తి చేసి ఇంటింటా తాగునీరు సౌకర్యం కల్పించనున్నారు.

పనుల వివరాలు ఇలా.. కరీంనగర్ నగరపాలిక పరిధిలో 10 ఎంఎల్‌డీల ఫిల్టర్‌బెడ్‌ను ఆధునికీకరణ చేయనున్నారు. 1100కేఎల్ సామర్థ్యంతో వాటర్ సంపు నిర్మాణం, మూడు పంపుసెట్లు, 9.61



కిలోమీటర్లు రేకుర్తి వరకు పంపింగ్ లైన్, ఫీడర్ లైన్, పైపులైను విస్తరణ, పంపుహౌజ్ నిర్మాణం, 400కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ తదితర పనులున్నాయి.

కొత్తపల్లి మున్సిపాలిటీలో స్టోరేజీ రిజర్వాయర్, ఫీడర్, సరఫరా పైపులైన్ల విస్తరణ, 3ఎంఎల్‌డీ శుద్ధి కేంద్రం, ట్రాన్స్‌ఫార్మర్, ఇంటింటా నల్లా కనెక్షన్లు, మోటార్లు ఉన్నాయి.

హుజురాబాద్‌లో ఫీడర్‌మెన్స్, పైపులైన్ల విస్తరణ, ఇంటింటా నల్లా కనెక్షన్లు 2 వేల కేఎల్ రిజర్వాయర్, ప్రహరీ, క్వార్టర్స్ నిర్మాణ పనులున్నాయి. చొప్పదండిలో స్టోరేజీ రిజర్వాయర్, పైపులైన్ల విస్తరణ, ఇంటింటా నల్లా కనెక్షన్లు, పంపుహౌజ్, జనరేటర్, రెండు చోట్ల వెయ్యి కేఎల్ సామర్థ్యంతో రిజర్వాయర్లు, క్వార్టర్లు, కాంపౌండ్‌వాల్ వంటి పనులు ఉన్నాయి. జమ్మికుంటలో స్టోరేజీ రిజర్వాయర్, పైపులైను విస్తరణ, ఇంటింటా నల్లాలు, నల్లా సౌకర్యం లేని ప్రాంతానికి కొత్తగా లైన్లు వేయడం పనులు చేస్తారు.

పరిపాలన అనుమతి రావాలి

సంపత్‌రావు, ఈఈ, ప్రజారోగ్యశాఖ, కరీంనగర్

విలీన కాలనీలు, కొత్త మున్సిపాలిటీల్లో తాగునీటి వసతి కల్పించేందుకు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. పరిపాలన అనుమతి రాగానే ఈఎన్‌సీ స్థాయిలో టెండర్లు పిలుస్తారు.

# ఓటర్ల జాబితాల పునఃపరిశీలన

ఖమ్మం : కొద్దినెలల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 2023 జనవరి 5న ప్రకటించిన తుది ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకొని ఓటర్ల వివరాలను పునఃపరిశీలించాలని కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఇటీవల సూచించింది. ప్రధానంగా గత ఏడాది కాలంలో తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి తనిఖీ చేయాలని ఆదేశించింది.

మొదలైన ప్రక్రియ ఏటా జనవరి 5న ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. 2022 జనవరిలో ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ఆధారంగా అదే సంవత్సరం అక్టోబర్ నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తగా ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణల ప్రక్రియ పూర్తి చేసి 2023 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటించారు. ఈ సమయంలో ఖమ్మం జిల్లాలో 29,550 మంది ఓటర్ల పేర్లు తొలగించారు. ఇందులో మరణించినవారు కొందరైతే.. రెండు లేదా అంతకంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదైన వారు మరికొందరు ఉన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సమయంలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి తగిన ఆధారాలతో కొందరి పేర్లను జాబితాల నుంచి తొలగించారు. ఇదే సమయంలో ఎన్నికల సంఘం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఫొటో సిమిలర్ ఎంట్రీలను గుర్తించి జిల్లాలకు జాబితాలు పంపించింది. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఒకచోట మాత్రమే పేరు కొనసాగించాలని, మరోచోట జాబితాల నుంచి తొలగించాలని ఉ



న్నతాధికారులు సూచించారు. కొందరు బీఎల్వోలకు సరైన అవగాహన లేకపోవటంతో వేర్వేరు పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల్లో నమోదైన పేర్లను తొలగించారు. కొంతమంది ఓటర్లు రెండుచోట్ల జాబితా నుంచి తొలగింపునకు గురై ఓటుహక్కు కోల్పోయారు. ఈ విషయాన్ని గుర్తించిన ఎన్నికల సంఘం.. జాబితాల నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పునఃపరిశీలించాలని ఆదేశించింది. తగిన ఆధారాలతో అర్హులకు ఓటుహక్కు కల్పించాలని స్పష్టం చేసింది. జిల్లాలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాల పునఃపరిశీలన ప్రక్రియ మొదలైంది. రెండుచోట్ల పేర్లు తొలగింపునకు గురైనవారు 377 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రక్రియను నియోజకవర్గ ఈఆర్వో (ఎలెక్టోరల్ రోల్ ఆఫీసర్), సహాయ ఈఆర్వోలైన తహసీల్దార్లు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ తనిఖీ చేయనున్నారు.

# చిన్నారులకు 'చిరు'విందు ఇద్దాం!

వరంగల్ : వేసవి సెలవులు రాగానే పిల్లలకు అమ్మలు, నాన్నమ్మలు, అమ్మమ్మలు అనేక రకాల వంటకాలు చేసి పెడుతుంటారు. ఇన్నాళ్లూ చదువుకొని కష్టపడ్డారని.. సెలవుల్లో వారు కోరుకునే వంటలు వండి వార్చాలని ఆరాటపడతారు. ఒకటి, రెండు రోజులు నూనె పదార్థాలతో చేసే ఆహార పదార్థాలు ఫర్వాలేదు. సుమారు 40 రోజులపాటు వరుసగా ఉన్న సెలవుల్లో పిల్లల కోసం ప్రత్యేక భోజన మెనూ తయారు చేయాల్సిందే. రుచితో పాటు అవి చిన్నారుల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తున్నాయని చూడాలి.ఆటపాటలతో అలసట చెందే వారికి తగిన క్యాలరీలు అందే ఆహారాన్ని అందించడం శ్రేయస్కరం. ఈ క్రమంలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే 'చిరుధాన్యాలు (మిల్లెట్లు) భోజనంలో భాగం చేయాలి. చిప్స్, కూల్‌డ్రింకులు, ఐస్‌క్రీమ్‌లు, ఇతర చిరుతిళ్ల స్థానంలో చిరుధాన్యాలతో చేసుకొనేగల వంటకాలు అనేకం ఉన్నాయి. ఈ సెలవుల్లో విద్యార్థులకు వీటి ప్రాధాన్యం తెలియజేయాలి.

ఇలా చేద్దాం...పిల్లలు సహజంగా పౌష్టికాహారం కన్నా రుచిగా ఉండేవే ఎక్కువ ఇష్టపడతారు. మిల్లెట్లకు విలువ జోడించకుండా వండి పెడితే తినడానికి ముందుకు రారు. పండ్లతో ఐస్‌క్రీమ్‌లను తయారుచేయొచ్చు. కొందరు పిల్లలు పాయసాన్ని ఎక్కువ ఇష్టపడతారు.. అలాంటి వారికి చిరుధాన్యాలతో పాలలాంటి పదార్థాలను అందించొచ్చు. రాగులను రాత్రి నానబెట్టుకొని ఉదయం రుబ్బేసి అందులో నీళ్లు పోస్తే రాగి పాలు అవుతాయి. ఈ పాలల్లో ఒక పండు ముక్కను కలిపి మిక్సీ పడితే మిల్లెట్ స్మూతీ తయారవుతుంది. వీటిని పిల్లలు ఇష్టంగా ఆరగిస్తారు. సజ్జలులాంటివి నానబెట్టి మొలకలు వచ్చాక వాటిని స్నాక్స్‌లా తినొచ్చు. మరింత రుచికరంగా ఉండాలంటే మొలకల్లో ఉల్లిపాయలు వేసి, నిమ్మకాయ పిండి చిన్నారులకు ఉదయం అల్పాహారంగా, సాయంత్రం స్నాక్స్‌గా ఇవ్వొచ్చు. పల్లీపట్టీలు, నువ్వుల ముద్దల్లో సైతం సామలు వేసి మిల్లెట్ చిక్కీలు చేయొచ్చు. సాధారణ బెల్లం కన్నా తాటి బెల్లంతోనూ వీటిని వండుకోవచ్చు. ఆటలాడి అలసిపోయి వచ్చిన పిల్లలకు వీటిని ఇస్తే బలవర్ధకంగానే ఉంటుంది.

రైతులకు ప్రోత్సాహం

ఐరాస 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. మన ప్రాంతంలో వీటిని పండించే వారి సంఖ్య చాలా తక్కువ. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' పథకంలో చిరు ధాన్యాలను పండించేందుకు 'మిల్లెట్స్ ప్రోగ్రాం' కింద హెక్టారుకు రూ. 6 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వనుంది. ఇటీవల వ్యవసాయ శాఖకు ఈ పథకంపై మార్గదర్శకాలు వచ్చాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మొదటి దఫాలో సుమారు 340 ఎకరాల చొప్పున చిరు ధాన్యాలను పండించేందుకు అధికారులు రైతులను గుర్తించారు.

అనేక రకాలుగా మేలు- డాక్టర్ రేపాల అనూష, డైటీషియనిస్ట్, ఏకశిలా ఆసుపత్రి, హనుమకొండ

చిరుధాన్యాలతో అనేక రకాల ఆహార పదార్థాలను ఇంట్లో తక్కువ ధరకు తయారుచేసుకోవచ్చు. రాగి ఫ్లేక్స్, జొన్న పేలాలు, మిల్లెట్ ప్రొటీన్ పౌడర్, మొలకలు వచ్చిన వాటిని స్నాక్స్‌గా తినొచ్చు. వీటిని క్రమం తప్పకుండా పిల్లలతో తినిపిస్తే వారికి ఆరోగ్యంతో పాటు అనేక రకాలుగా మేలు జరుగుతుంది.

# శుద్ధజలానికి సాక్ష్యం



ఖమ్మం : చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. చిన్న పిల్లల నడవడికలో మార్పు తెచ్చి ఇక్కడ అక్షరాలు నేర్పుతున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు. ఇప్పుడు ఆయా కేంద్రాలకు త్వరలో శుద్ధజలం అందనుంది. తొలుత సొంత భవనాలున్న కేంద్రాల్లో మినీ ఆర్వోప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో వాటి వివరాలను సేకరించారు. ఉభయ జిల్లాల్లో ఇందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదకొండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా మరికొన్ని అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. ఇంకొన్ని ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో తగిన వసతులు లేవు. దీంతో కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 'సాక్ష్యం' పథకంలో భాగంగా మినీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ముందుగా సొంత భవనాలు, పిల్లల సంఖ్య అధికంగా ఉన్న కేంద్రాలకు ప్రాధాన్యమివ్వనుంది. అవసరమైన లీటర్ల సామర్థ్యం మేరకు ప్లాంట్లు స్థాపించనుంది. అనంతరం విడతల వారీగా మిగిలిన కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లను సమకూర్చనుంది.

పరిశీలించి ఎంపిక చేస్తాం

సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి

జిల్లాలో సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చి మినీ ఆర్వో ప్లాంట్లకు ఎంపిక చేయనున్నాం. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా రూ.లక్ష అందించనుంది. ఈ నిధులతో ఆర్వోప్లాంట్లతో పాటు కేంద్రాల్లో అవసరమైన వసతులను సమకూర్చనున్నాం. ఇప్పటికే పరిశీలన ప్రక్రియ మొదలైంది. ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలోనే జాబితా రూపొందిస్తాం.

# జెండా పాట.. నష్టాల మూట..!



ఖమ్మం : ఖమ్మం మార్కెట్‌లో మిర్చి రైతులు దగా పడుతూనే ఉన్నారు. పలికిన జెండా పాటకు ఏకంగా రూ.5వేలు తగ్గించి వ్యాపారులు మిరపను కొనుగోలు చేయటంతో అన్నదాతలు లబోదిబోమన్నారు. గిట్టుబాటు ధర దొరుకుతుందనే కొండంత ఆశతో మార్కెట్‌కు వస్తే కొనుగోళ్ల మాయాజాలంతో నష్టాల మూట గట్టుకుని తిరుగుపయనమయ్యారు.

నెల రోజులుగా ఇదే తంతు..!

ఖమ్మం విపణికి నెల రోజులుగా మిర్చి రాక క్రమేణా పెరుగుతూ వస్తోంది. ఇటీవల ఒకరోజు మార్కెట్‌కు అత్యధికంగా సుమారు 70 వేల బస్తాల మిర్చిని రైతులు తీసుకొచ్చారు. మంగళవారం దాదాపు 50 వేల బస్తాల సరకు వచ్చింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలతో పాటు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి మిరపకాయలను రైతులు తీసుకొచ్చారు. మార్కెట్ అధికారులు జెండా పాటను రూ.23వేలు, నమూనా రకం మిర్చికి రూ.21వేలు, కనిష్ఠ ధర రూ.18వేలుగా నిర్ణయించారు. ధరలను వ్యాపారులు అమాంతం తగ్గించటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. నాణ్యత, తేమ శాతాన్ని సాకుగా చూపి వ్యాపారులు రూ.18వేల నుంచి రూ.21వేల వరకు కొన్నారు. అత్యధిక మంది రైతులు క్వింటాకు రూ.5 వేల వరకు నష్టపోయారు.

మోసగించటమే ఎ'జెండా'..

మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్న నమ్మకంతో వస్తే.. ఇక్కడ కొనుగోళ్లు సాగుతున్న తీరుతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు కన్నీరుమున్నీరయ్యారు. సాకులు చూపుతూ ధరలు అమాంతం తగ్గించేస్తున్నారని వాపోయారు. ఇటీవల జెండా పాట అత్యధికంగా రూ.25వేల వరకు పలికింది. ఈనెల 11న రూ.24,500, 13న రూ.23,700, 17న రూ.23,500 పలికిన ధర మంగళవారం రూ.23వేలకు పరిమితమైంది. అసలే జెండా పాట దక్కడం లేదన్న బాధతో ఉంటే.. రోజురోజుకూ జెండా పాట పడిపోతుండటం రైతులను మరింత కుంగదీస్తోంది. చేసేదేమీ లేక వ్యాపారులు అడిగిన ధరకే సరకును విక్రయిస్తూ నష్టాలు మూటగట్టుకుని వెనుదిరుగుతున్నారు.పది క్వింటాళ్ల మిర్చి తీసుకొచ్చాను. జెండా పాట ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాట ధర దక్కలేదు. అనేక సాకులు చెప్పి ధర రూ.18,700గా నిర్ణయించారు. తీసుకొచ్చిన మిర్చితో మళ్లీ ఇంటికి వెళ్లలేక అమ్మేశాను. మంచి ధర దక్కుతుందని చాలాదూరం నుంచి వస్తే చివరకు నష్టమే మిగిలింది. వీరబోయిన యలమంచి, సర్వారం, మోతె మండలం, సూర్యాపేట జిల్లాఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధర ఆశాజనకంగా ఉందని అద్దె వాహనంలో 20 బస్తాల సరకు తెచ్చాను. ఒక్కో బస్తాకు రూ.100 రవాణా ఖర్చు అయింది. తీరా ఇక్కడికి వచ్చాక జెండా పాట రూ.23వేలు ఉంటే.. నా మిర్చి రూ.19వేలు మాత్రమే పలికింది. నాణ్యత కలిగిన సరకే అయినా ఒక్కో క్వింటాకు రూ.4వేలు తగ్గించి కొనటంతో తీవ్రంగా నష్టపోయాను. జగన్మోహన్‌రావు, మిరప రైతు, జగ్గయ్యపేట

# చెప్పేదొకటి.. ఇచ్చేదొకటి..!



ఇల్లెందు : భగభగమండే ఎండల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటూ బొగ్గు గనుల్లో సింగరేణి అద్దె వాహనాల మోటరు కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా వారి శ్రమకు తగిన వేతనం అందటం లేదు. సింగరేణి యాజమాన్యం టెండర్ ద్వారా నడిపిస్తున్న బొలెరోలు, క్యాంపర్లు, నీటి ట్యాంకర్లు, అంబులెన్స్‌లు, లారీల వంటి అద్దె వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్న మోటరు కార్మికులకు స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నా.. బిల్లులు మంజూరై యజమాని నుంచి డ్రైవర్ చేతికి అందేసరికి వేతనాలు కోతలకు గురవడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సింగరేణి వ్యాప్తంగా అద్దె వాహనాల మోటరు కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల్లో గాడీల యజమానులే కక్కుర్తి పడుతుండటం గమనార్హం. డ్రైవర్ల ఏటీఎం కార్డులను వాహనాల యజమానులు తమ దగ్గర ఉంచుకుంటున్నారంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నెల రోజులకు చెల్లించాల్సిన వేతనం.. బిల్లు మంజూరై డ్రైవర్ చేతికి అందే వరకు సుమారు 50 రోజులు పడుతోంది. ఈ విధంగానూ డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధైర్యం చేసి తమ గోడు వినిపిద్దామనుకుంటే మరుసటి రోజు విధుల నుంచి తొలగిస్తారేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. ప్రత్యామ్నాయ మార్గం లేక చాలీచాలని వేతనంతోనే విధులు నిర్వర్తిస్తున్నారు.సింగరేణి యాజమాన్యం అద్దె వాహనాల డ్రైవర్లను స్కిల్డ్ కార్మికులుగా గుర్తించింది. రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తే రూ.671 వేతనమిస్తుంది. ఇలా నెలలో 26 రోజులు ఎనిమిది గంటలు విధులు నిర్వర్తించే వారికి రూ.17,446 చెల్లిస్తుంది. అయితే వాహన యజమానులు మాత్రం ఆ వేతనంలో కోతలు పెడుతూ.. ఎనిమిది గంటలు పనిచేసే కార్మికుడికి రూ.12వేల నుంచి రూ.13వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. రోజుకు 12 గంటలు విధులు నిర్వర్తించే వారికి నెలకు రూ.26,156 చెల్లించాల్సి ఉండగా రూ.18 వేలు మాత్రమే ఇస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు.ఇవీ డ్రైవర్ల సమస్యలు.. నెలకు 26 రోజులు డ్యూటీ చేయాల్సి ఉన్నా 30 రోజులు విధులకు హాజరవ్వాల్సిన పరిస్థితి.వాహన యజమానులు యాక్టింగ్ డ్రైవర్లను నియమించడం లేదు.బోనస్‌లు, యూనిఫామ్స్ లేవు.వీటీసీ, మెడికల్ చెకప్ ఖర్చులను డ్రైవర్లే భరిస్తున్నారు. ప్రతినెలా 1న అందాల్సిన వేతనం.. పది నుంచి 20 రోజుల తర్వాత అందుతోంది.సింగరేణి అద్దె వాహనాల డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు అందజేస్తున్నాం. వారి వేతనాల్లో కోతలుంటాయనే విషయం మా దృష్టికి రాలేదు. మోటరు కార్మికులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. షాలేము రాజు, ఏరియా జీఎం, ఇల్లెందు

# రెండు నెలలైనా తేలని ప్రీతి అంశం

వరంగల్ : కాకతీయ మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం (అనస్తీషియా) వైద్యవిద్యార్థిని డాక్టర్ దారావత్ ప్రీతి ఆత్మహత్యకు సంబంధించిన కేసు ఇప్పటి వరకు ఎటూ తేలలేదు. గత ఫిబ్రవరి నెల 22న ఎంజీఎం ఆసుపత్రిలోని అత్యవసర శస్త్రచికిత్స విభాగంలోని విశ్రాంతి గదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గదిని అదే రోజు మట్టెవాడ పోలీసులు సీజ్ చేసి విచారణ చేస్తున్నారు. పలుమార్లు స్వయంగా పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రీతి పడిపోయిన గదిని పరిశీలించి విచారణ చేశారు. సంఘటన జరిగి 56 రోజులవుతున్నా.. ఇప్పటి వరకు కేసులో ఏలాంటి పురోగతి కనిపించకపోగా, మట్టెవాడ పోలీసులు సీజ్ చేసిన గది తాళాలను తొలగించి ఎంజీఎం అధికారులకు అప్పగించారు. ఈ కేసును పోలీసులు ఎటు తేల్చకుండానే గది తాళాలను ఎంజీఎం అధికారులకు అప్పగించడంపై వైద్యవర్గాలు, గిరిజన సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గదిని సీజ్ చేసిన పోలీసులు తాళాలు ఆసుపత్రి అధికారులకు అప్పగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో ఇప్పటివరకు పోలీసులు ఏం చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పీజీలు, సిబ్బందికి అత్యవసర చికిత్స కోసం ఆ గది అవసరమైనదని, అందుకే తాళాలు అప్పగించినట్లు మట్టెవాడ పోలీసులు పేర్కొన్నారు.

# గుట్టుగా తరలుతున్న ఖనిజం..!

మహబూబాబాద్ : కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినా అక్రమార్కులు బైరటీస్ తరలింపు మానడం లేదు.. కంచెను ఛేదించుకొని మరీ అక్రమానికి పాల్పడుతున్నారు. గార్ల మండలం పోచారం, బాలాజీతండా, కోట్యానాయక్‌తండా పంచాయతీ పరిధిలో మూతపడిన బైరటీస్ మైనింగ్ ప్రాంతాల నుంచి కొంత మంది అక్రమార్కులు ఖనిజాన్ని రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి అయితే చాలు విలువైన ఖనిజం ఉన్న గుట్టకు చేరుకొని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి సమయంలో భద్రతను పెంచి ఖనిజం తరలింపునకు చెక్ పెట్టాలని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడేళ్ల నుంచి ..

ఈ ముడి ఖనిజాన్ని పెట్రోల్ శుద్ధి, రంగుల తయారీ, తదితరాలకు వినియోగిస్తారు. దీనిపై అక్రమార్కులు కన్నుపడింది. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ మైనింగ్ ప్రాంతానికి వాహనాలు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు తవ్విన కందకాలను సైతం పూడ్చి ఖనిజాన్ని దోచుకుంటున్నారు. మూసేసే సమయంలో గుట్టపై అక్కడక్కడ వదిలేసిన ఖనిజ కుప్పలను కాజేస్తున్నారు. మూడేళ్ల కిందట బైరటీస్‌ను ఆ ప్రాంతంలోని ఓ వ్యక్తి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా



తరలిస్తుండగా అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. ఇటీవల కొంత మంది అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నట్లు సమాచారం. రాత్రి వేళల్లో టిప్పర్ల, ట్రాక్టర్ల ద్వారా కాకినాడకు పంపిస్తున్నారు. అక్కడి నుంచి వారు అనుకున్న చోటుకు చేర్చుతున్నారు. టిప్పరు ఖనిజాన్ని రూ. 8 లక్షలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

పరిశ్రమ పునరుద్ధరిస్తే

పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి పరిశ్రమ పునరుద్ధరణ చేపట్టాలి. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా నిరుద్యోగులకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయని వారిని దృష్టిలో పెట్టుకుని పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం-రమేశ్, డీఆర్వో

రాత్రి పూట నిఘా ఉండేలా వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలంటూ జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపించాం. ఎవరైనా ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తే గుర్తించి చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పట్టుబడిన వారి యొక్క భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలను స్వాధీనం చేసుకుంటాం. కేసులు నమోదు చేస్తాం.

# కొత్త వారికి అవకాశం లేదు!

జగిత్యాల : పెంపకందారులకు రాయితీపై గొర్రెల యూనిట్లను పూర్తిస్థాయిలో అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 22,674 మంది గొర్రెల కాపరులను గుర్తించగా వీరిలో 292 సంఘాల పరిధిలో 21,067 మందికి రాయితీపై గొర్రెలను ఇవ్వాలని సంకల్పించారు. ఇందులోనూ తొలివిడతలో 2017-18 ఆర్థిక సంవత్సరంలో 10,557 మందిని ఎంపికచేయగా 9,756 మంది డీడీలను తీసిచ్చి గొర్రెలను తీసుకున్నారు. డీడీలు తీసివ్వనందున 801 మందికి గొర్రెలను పంపిణీ చేయలేదు. జిల్లాలో రెండో విడతలో 10,510 యూనిట్లను గుర్తించగా 7,694 మంది డీడీలను తీసిచ్చారు. వీరిలో 5,198 మందికి యూనిట్లను పంపిణీ చేసిన తరువాత 2018 చివర్లోనే పథకాన్ని ఆపివేశారు. 21 గొర్రెలతో కూడిన ప్రతి యూనిట్ పూర్తిధర రూ. 1.25 లక్షలుండగా



ప్రభుత్వ రాయితీ రూ.93,750 పోను లబ్ధిదారులు రూ.31,250 చొప్పున చెల్లించారు. పథకాన్ని ఆపివేసే సమయానికే జిల్లాలో 2,496 మంది తమవంతు మొత్తాన్ని చెల్లించారు. కాగా రెండేళ్లక్రితం యూనిట్ ధరను రూ.1.75 లక్షలకు పెంచటంతో మిగిలిన 2,496 మంది ఒక్కో యూనిటుకు తమవంతుగా మళ్లీ రూ.12,500 చొప్పున అదనంగా రూ.3.12 కోట్లను చెల్లించాల్సి వచ్చింది. వీరికి గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. జిల్లాలో రెండోవిడతలో 2,816 మంది డీడీలను తీసివ్వలేదు.

ప్రస్తుతం రూ.1.75 లక్షల యూనిట్ విలువలో రూ.43,750 మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.1,31,250 రాయితీగా ఉంది. జిల్లాలో రెండు విడతల్లో కలిపి 3,617 మంది గొర్రెలు అందని వారున్నట్లుగా అధికారులు గుర్తించి ప్రస్తుతం వీరినుంచి డీడీలను తీసుకుంటుండగా ఇప్పటివరకు 250 మంది వరకు తమవంతు వాటా మొత్తానికి డీడీలు తీసిచ్చారు. మరోవైపు 2017 సంవత్సరంలో ఎంపికచేసిన జాబితాలోని వారికే ప్రస్తుతం అవకాశం ఇస్తున్నారు. నూతనంగా పెంపకందారులకు పథకంలో అవకాశం కల్పించనందున దాదాపుగా 1,500 మంది వరకు నిరాశగా ఉన్నారు. ఐదేళ్లక్రితం తక్కువ ధరలో గొర్రెలు తీసుకున్నవారికి ఇప్పటిదాకా మంద పెంపు జరగగా తాము అధికధర చెల్లించాల్సి రావటం, ఐదేళ్లు ఆలస్యంగా గొర్రెలను ఇవ్వటంతో లబ్ధికలగదని, రాయితీని పెంచాలని పెంపకందారులు కోరుతున్నారు. మరోవైపు గత విడతల్లో పలుచోట్ల పంపిణీ అవకతవకలు జరగగా ఈ సారి పక్కాగా పంపిణీ చేయాల్సిఉంది. 2017 జాబితాలోని దాదాపు 50 మంది వరకు మృతిచెందగా వీరి భార్య లేదా కుమారులను పథకంలో చేర్చేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. జాబితాలోగల మిగిలినవారు తమవంతు వాటా మొత్తానికి డీడీలను తీసివ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకలనుంచి గొర్రెలను తెచ్చి లబ్ధిదారులకు అందించనున్నట్లు వివరించారు.

# ప్రయాణికుల పాట్లు





ఖమ్మం : మానుకోటలో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. విలీన గ్రామాలు, అనేక శివారు కాలనీలతో నలుదిక్కుల నాలుగు కిలోమీటర్ల మేర విస్తరించిన పట్టణంలో గృహాలు, జనాభాతో పాటు వాహనాల రద్దీ కూడా విపరీతంగా పెరిగిపోయింది. అలాగే వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే వాహనాల తాకిడి విపరీతంగా పెరిగిపోయింది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. తాజాగా పట్టణ నడిబొడ్డున గతంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్యూబీ) రీ డిజైన్ పనులతో మార్గం గుండా రాకపోకలకు బ్రేక్ పడడంతో వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలలుగా ఆర్యూబీ రీ డిజైన్ పనులు జరుగుతుండడంతో కొత్త, పాత బజారులకు వెళ్లేందుకు నిర్మాణాలు జరిగిన సమయాల్లో వాహనదారులు పడారాని పాట్లు పడుతున్నారు. గమ్యస్థానాలకు చేరుకునేందుకు పట్టణం చుట్టూ మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణిస్తూ ఇబ్బంది పడుతున్నారు.

పాత, కొత్త బజారులకు రైల్వే గేట్ ఒక్కటే మార్గం...జిల్లా కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి రీ డిజైన్ పనులు కొనసాగుతుండడంతో పాత, కొత్తబజారులకు వెళ్లాలంటే పట్టణంలోని రైల్వే గేటే ఒక్కటే మార్గంగా నిలిచింది. గతంలో రూ.18కోట్లతో రైల్వే మధ్యగేటు ప్రాంతంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్యూబీ) గుండానే వాహనాలన్నీ వెళ్తాయి. తాజాగా రూ.2కోట్లతో చేపడుతున్న రీ డిజైన్ పనులతో ఆ మార్గం గుండా వెళ్లకపోవడంతో ఉన్న ఒక్క రైల్వే ఏ- క్యాబిన్ గేట్ నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇక ఊరి చివరలో కురవిరోడ్‌లో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) గుండా వెళ్లాలంటే దాదాపుగా నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోంది. పెట్రోల్ రేటు గణనీయంగా పెరగడంతో వాహనదారులు ఆలోచిస్తున్నారు. ఇక రాత్రి వేళల్లో ఆర్వోబీ గుండా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. దీంతో వాహనాలన్నీ ఉన్న ఏకైక మార్గం రైల్వే గేట్ నుంచి వెళ్లక తప్పని పరిస్థితి. ఇక గేట్ పడితే చాలు దాదాపుగా అర కిలోమీటర్ మేర ఆ రోడ్డు వెంట వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. గేట్ తీసిన సమయంలో దాదాపుగా 10 నిమిషాలు పైనే ఆ మార్గంలో రైల్వే గేట్‌లో నుంచి వాహనాలు వెళ్తున్నాయంటే వాహనాల రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అత్యవసర సమయాల్లో గత్యంతరం లేక అనంతారం రోడ్‌లోని, సిగ్నల్ కాలనీ సమీపంలోని మరమ్మతులకు నోచుకుని అండర్ పాస్‌ల నుంచి.. సరిగ్గా లేని రోడ్లపై ద్విచక్ర వాహనదారులు వెళ్తున్నారు.

రీ డిజైన్ ఎందుకంటే...మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్యూబీ) రీ డిజైన్ ద్వారా కొంత మంది వ్యాపారస్థులకు మేలు జరగనుంది. గతంలో ఆర్యూబీ నిర్మించిన ప్రాంతాలు కొత్త బజారులోని శ్రీరామమందిరం, ప్రభుత్వ ఆస్పత్రి, రెడ్డి బజారు, పాత బజారులోని బుక్క బజారు ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి కింది భాగం సమీపం నుంచి స్లోపుగా పెంచుకుంటూ చుట్టూ నాలుగు దిక్కులా సుమారు 100 మీటర్లకు పైగా దాదాపుగా 10 నుంచి 12 ఫీట్లలోతుతో పెంచుకుంటూ ఆర్యూబీని నిర్మాణం చేపట్టారు. దీంతో అనేక మంది వ్యాపారుల షాపులు మూతపడి నష్టపోయారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆర్యూబీ రీ డిజైన్ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం రైల్వే బ్రిడ్జి సమీపంలో రెండు ఫీట్ల నుంచి చివరి వరకు ఆరు ఫీట్ల ఎత్తు రోడ్డును లేపుతూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈక్రమంలో గతంలో నిర్మించిన రేలింగ్‌ను తీసివేయడం ద్వారా అనేక షాపులు రోడ్డు వైపునకు వస్తున్నాయి. దీంతో కొంత మంది వ్యాపారస్థులకు మేలు జరగనుంది.

మరో ఆర్యూబీ.. ఆర్వోబీ నిర్మించాలి..మహబూబాబాద్ జిల్లా ఆవిష్కృతం అయిననాటి నుంచి వాహనదారులు ఇక్కట్లు పెరిగిపోయాయి. వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్యలు మొదలయ్యాయి. దీంతో జిల్లా ఏర్పడ్డ నాటి నుంచి ఔటర్ రింగు రోడ్డు డిమాండ్ తెరపైకి వచ్చింది. ఎప్పుడు వస్తుందో అంటూ వాహనదారులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు ఔటర్ రింగు రోడ్డు నిర్మాణం చేపడుతామని ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయాలని తెలంగాణ సర్కార్ పూర్వంలో అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. జిల్లా ఏర్పడి ఐదేళ్లు పూర్తయిన ఔటర్ రింగురోడ్డుకు మోక్షం లభించలేదు. దీంతో భారీ వాహనాలు సైతం పట్టణ పురవీధుల గుండానే వెళ్తున్నాయి. మరోపక్క గతంలో రూ.58 కోట్లతో మరో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) మంజూరు అయినప్పటికీ దానికి అతిగతి లేకుండా పోయింది. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఆర్యూబీ రీడిజైన్ పనులతో పాత, కొత్త బజారులకు వెళ్లే ఆ మార్గం మూసివేయడం... రైల్వే గేట్ రోడ్‌లో వాహనాల రద్దీ తీవ్రంగా పెరిగింది. వాహనరద్ధీ దృష్ట్యా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకుల తీరు..అధికారుల అనాలోచిత చర్యలపై ప్రజలు మండిపడుతున్నారు. లక్ష జనాభా దాటిన మానుకోట పట్టణానికి వాహనాల రద్ధీ నేపథ్యంలో మరో ఆర్యూబీ, ఆర్వోబీని నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ఔటర్ రింగురోడ్డు మరో రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలతో వాహన తాకిడి, ట్రాఫిక్ సమస్య తొలగిపోతుందని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ దిశగా పాలకులు ఆలోచన చేసి తమ కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ మార్గం చూపాలి : ఆకుల రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మానుకోట మహబూబాబాద్ పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ఆర్యూబీ మార్గం ప్రధానమైంది. రీ డిజైన్ పనులు చేపట్టే క్రమంలో ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క అనంతారం రోడ్డు మార్గంలోని, సిగ్నల్ కాలనీ సమీపంలో ఉన్న అండర్ పాస్‌ల వద్ద మరమ్మతు లు చేస్తే ఆయా మార్గాల గుండా ద్విచక్రవాహనాలు, ఆటో లాంటి చిన్న వాహనాలు వెళ్తే రైల్వేగేట్ వద్ద వాహనాల తాకిడి తక్కువగా ఉంటుంది. ఔటర్ రింగ్ రోడ్‌ను కూడా మంజూరు చేసి నిర్మిస్తే పట్టణంలో భారీ వాహనాల రద్ధీ తగ్గుతుంది.

మరో ఆర్వోబీ, ఆర్యూబీ మంజూరు చేయాలి : పాపాచారి, వాహనదారుడు, మానుకోట మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి మరో ఆర్యూబీ, ఆర్వోబీని మంజూరు చేయాలి. రోజు రోజు పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీతో మరో ఆర్యూబీ, ఆర్వోబీ అవసరం. పాలకులు ఆదిశగా ఆలోచించి తక్షణమే మంజూరు చేయాలి. ఆర్యూబీ రీ డిజైన్ పనులు జరిగిన సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల కష్టాలను తొలగించే దిశగా అధికారులు, పాలకులు ప్రణాళికలు సిద్ధం చేయాలి.

## నాసిన్ చెరువు శుద్ధీకరణ

రంగారెడ్డి : : చెరువుల శుద్ధీకరణకు పూనుకుంది దమ్మాయిగూడ మున్సిపల్ పాలకవర్గం. మురుగునీటితో నిండిన చెరువులను స్వచ్ఛంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోంది. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో నాసిన్ చెరువు, కోపులకుంట, కుమ్మరికుంట జలాశయాలున్నాయి. దాదాపు 30ఏళ్ల క్రితం వరకు ఆ చెరువుల చుట్టూ ఆయకట్టును ఆ నీటితోనే సాగు చేశారు. పశువుల దప్పిక తీర్చేందుకు ఆ నీటినే వినియోగించేవారు. ఆ చెరువుల్లో పెంచిన చేపలను విక్రయించి మత్స్యకారులు జీవనోపాధి పొందారు. కాగా కాల క్రమేణ దమ్మాయిగూడ నగరానికి చేరువలో ఉండటంతో పెద్దఎత్తున జనాలు ఇక్కడికి వలస వచ్చారు. ఈ తరుణంలో చెరువు పరివాహక ప్రాంతంలో అదే స్థాయిలో కాలనీలు వెలిశాయి. ఈ క్రమంలో ఇళ్ల నుంచి వెలువడిన వ్యర్థజాలాలు చెరువులోకి చేరడంతో మురుగుకూపంగా మారింది. ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి తోడు పక్కనే జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దోమల స్వైరవిహారంతో జనాలు తరచూ అంటు వ్యాధులబారిన పడుతున్నారు. ఈ క్రమంలో చెరువును శుద్ధిచేసేందుకు మున్సిపల్ పాలక వర్గం




చర్యలు చేపట్టింది. స్థానికులు మంత్రి మల్లారెడ్డికి మొర పెటుకోగా ఆయన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పాలకవర్గ దీక్ష, మంత్రి కృషితో ప్రయత్నం ఫలించింది. మురుగునీరు చెరువులో చేరకుండా ప్రత్యేకంగా భారీ పైపులైను వేసేందుకు హెచ్ఎండీఏ ముందుకువచ్చింది. అందుకుగాను రూ.రూ.7.10కోట్లను మంజూరు చేసింది. ఫిబ్రవరి24న మంత్రి చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. ముందుగా ఎగువ నున్న దమ్మాయిగూడ చెరువు నుంచి పలు కాలనీల గుండా నాసిన్ చెరువు వరకు వేయాలనుకున్న పైప్‌లైన్ ప్రజల వినతి మేరకు నాగారం మున్సిపాలిటీకి అనుకుని ఉన్న కుమ్మరికుంట వరకు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. చెరువుల్లో మురుగునీరు చేరకుండా చర్యలతో పాటు మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చి దిద్దేందుకు ప్రాణాళికా బద్దంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో మంత్రి మల్లారెడ్డి స్వయంగా పైప్‌లైన్ పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చెరువు పరిసరాలను సుందరీకరించటతో అహ్లాదవాతావరణం నెలకొంటుందని, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 7.10 కోట్లతో పనులు:–వసుపతి ప్రణీత, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గతంలో శుద్ధ జలాలతో కళకళలాడిన చెరువు నేడు మురికి కూపంగా మారింది. తద్వారా స్థానికులు అనారోగ్యానికి గరౌతున్నారు. ఈ నేపథ్యంలో చెరువును శుద్ధి చేసి, మంచినీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హెచ్ఎండీఏ మంజూరు చేసిన రూ.7.10కోట్లతో ప్రత్యేక భారీ పైప్‌లైన్ నిర్మాణాన్ని చేపట్టాం. పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.

జూన్ మొదటి వారం నాటికి పనులు పూర్తి : – వెంకటేష్, ఏఈఈ, హెచ్ఎండీఏ దమ్మాయిగూడలోని నాసిన్ చెరువులో మురుగునీరు మళ్లింపు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం నాటికి (జూన్ మొదటి వారం) పైప్‌లైను నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ సంవత్సరం చెరువులో కేవలం వర్షం నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం.

## అసైన్డ్ భూములపై రియల్టర్ల కన్ను

రంగారెడ్డి : మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ఉన్న అసైన్డ్‌భూములపై రియల్టర్ల కన్ను పడింది. గుట్టుచప్పుడు కాకుండా భూములు కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎకరానికి రూ.17లక్షలకు కొంటామని రైతులకు ఆశ చూపుతూ అడ్వాన్స్‌లు కూడా ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలు క్రయవిక్రయాలకు అవకాశం లేని అసైన్డ్ భూములను ఎందుకు కొంటున్నారో ఎవరికీ తెలియడం లేదు. అసైన్డ్ భూములను కొని రిజిస్ట్రేషన్ ఎలా చేసుకుంటారని రైతులు అడిగితే.. అదంతా మేము చూసుకుంటామని రియల్టర్లు సమాధానమిస్తున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. ఈ విషయం బయటకు రాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.మొండిగౌరెల్లిలో సర్వే నెంబర్19లో 575ఎకరాల 30 గుంటలు, సర్వే నెంబర్ 68లో 788ఎకరాల 20 గుంటలు, సర్వేనెంబర్ 127లో 122ఎకరాల 22గుంటల అసైన్డ్ భూములున్నాయి. వీటిని కొనుగోలు చేయాలని నగరానికి చెందిన రియల్టర్లు చూస్తున్నారు. రైతులు ఈ భూములను రియల్టర్లకు విక్రయించడం కోసం గ్రామానికి చెం దిన కొందరు వ్యక్తులు ముందుండి వ్యవహారం నడిపిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూములు క్రయవిక్రయాలకు తావులేదని ఎవరైనా రైతులు నిలదీస్తే.. వారికి అదనంగా మరో రూ.10వేలు ఇస్తున్నారు. కేవలం మీరు రెవెన్యూ కార్యాలయానికి వచ్చి సంతకాలు పెడితే చాలు.. అంతా తావే చూసుకుంటామని రియల్టర్లు నమ్మిస్తున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతులను నయానభయాన ఒప్పించి భూములను విక్రయించేలా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొంతమంది రైతులకు టోకన్ డబ్బు కూడా ముట్టినట్లు గ్రామంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ భూముల క్రయవిక్రయాలపై ఇటీవల జరిగిన గ్రామసభలో కూడా చర్చ జరిగింది. భూములు క్రయవిక్రయాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సర్పంచ్ బి.కృష్ణ వద్ద ప్రస్తావించగా..గ్రామసభలో చర్చకు వచ్చిందన్నారు. ఈ భూములు క్రయవిక్రయాలు జరగరాదన్నారు. ఒకవేళ అలా చేస్తే ప్రభుత్వం పీవోటీ కింద తీసుకుంటుందన్నారు.

అసైన్డ్ భూములు అమ్మితే చర్యలు మొండిగౌరెల్లి గ్రామంలో అసైన్డ్ భూములు క్రయవిక్రయాలు జరిపితే తగు చర్యలు తీసుకుంటాం. ఈ భూములపై ప్రభుత్వానికి అన్ని హక్కులున్నాయి. అసైన్డ్‌భూములకు రిజిస్ట్రేషన్ చేసే అధికారం మాకు లేదు. ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు ఎప్పుడైనా తీసుకునే అధికారముంటుంది. అందుకే క్రయ విక్రయాలు జరపరాదు. – మహమూద్ అలీ, యాచారం తహసీల్దారు

## అన్నదాతకు బెంగ

మహబుబాబాద్ : మరికొన్ని రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. దీంతో వర్షాలు పడితే విత్తనాలు విత్తేందుకు అన్నదాతలు ప్రణాళికలు రచించుకుంటున్నారు. ఈ సారి రుతుపవనాలు కొంచం ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో.. విత్తనాల కోసం మదనపడుతున్నారు రైతులు. కర్షకుల అవసరాలు, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, నాసీరకం విత్తనాలను దళారులు అంటగట్టే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఎప్పటిలాగే ఈ మారు కూడా అలాంటి బెడద తప్పదేమోనని వారు ఆందోళన చెందుతున్నారు.అయితే నకిలీ విత్తనాలు అరికట్టడానికి రాష్ట్రప్రభుత్వం ఆదేశం మేరకు మహబూబాబాద్ జిల్లాలో టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం ఏర్పాటైంది. మరోవైపు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందాలు పలు మండలాల్లో విత్తన దుకాణాలపై దాడులు ప్రారంభించారు. కాగా, గ్రామాల్లో పటిష్టమైన నిఘా లేకపోవడంతో ఇతర జిల్లాల నుంచి నకిలీ విత్తనాలు, ప్రభుత్వం అనుమతి లేని విత్తనాలు వచ్చే ప్రమాదం పొంచిఉంది.

గత ఏడాది దొరికాయి ఇలా..

గత సంవత్సరం జిల్లాలో ఆరు కేసులు నమోదయ్యాయి. జూన్ 4న కొత్తగూడ మండలం ఎంచగూడెంలో రూ.2.32 లక్షల విలువైన ప్రభుత్వ అనుమతిలేని 16 క్వింటాళ్ల ధాన్యం విత్తనాలను పట్టుకుని, ఒకరిని అరెస్టు చేశారు. అదేనెల 6న మహబూబాబాద్‌లో నకిలీ మిర్చి ఎఫ్1 హైబ్రిడ్ విత్తనాలను గుంటూరు జిల్లా నుంచి తీసుక వచ్చి విక్రయిస్తుండగా.. రూ. 13.56 లక్షల విలువ చేసే 32 కిలోల మిర్చి విత్తనాలను పట్టుకుని ముగ్గురు వ్యక్తులను అధికారులు అరెస్టు చేశారు.

గత జూన్‌నెల 14న వరంగల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంటు అ?ధికారులు మానుకోట జిల్లా కేంద్రంలోని ఓ అగ్రిమాల్ దుకాణంపై దాడులు చేసి రూ.14,100 విలువ చేసే 4.23 కిలోల కాల పరిమితి దాటిన కూరగాయల విత్తనాలను పట్టుకుని ఒకరిని అరెస్టు చేశారు. అదే విధగా మరిపెడలో జూన్ 4న రూ. 3.33 లక్షల విలువ చేసే 5.43 కిలోల ప్రభుత్వం అనుమతిలేని మిర్చి విత్తనాలను రాత్రి సమయంలో ఇంటింటికి తిరిగి అమ్ముతుండగా అధికారులు పట్టుకుని ఒకరిని అరెస్టు చేశారు. 7న రూ. 4.33 లక్షల విలువ చేసే 7.90 కిలోల మిర్చి విత్తనాలను పట్టుకుని ఒకరిని అరెస్టు చేశారు. 19న రూ. 84వేలు విలువ చేసే 1.03 కిలోల మిర్చి విత్తనాలను పట్టుకొని ఒకరిపై 6ఏ కేసు నమోదు చేశారు.

టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం పోలీసు, వ్యవసాయ అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో వ్యవసాయ అధికారి, ఎస్సై, సీడ్స్ సర్టిఫికేషన్ అధికారి కలిపి మండలస్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని,




డివిజన్ స్థాయిలో డీఎస్పీ, ఏడీఏ, సీడ్స్ సర్టిఫికేషన్ అధికారి, జిల్లాస్థాయిలో ఎస్పీ, జిల్లా వ్యవసాయ అధికారి, సీడ్స్ సర్టిఫికేషన్ అధికారులు కలిసి టాస్క్‌ఫోర్స్ బృందాలుగా కలిసి పనిచేస్తాయి. దీంతో పాటు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలోని విత్తన దుకాణాలపై దాడులు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం మహబూబాబాద్, కురవి, మరిపెడ, తొర్రూరు ప్రాంతాల్లో ఒకేరోజు దాడులు నిర్వహించి, దడ పుట్టించింది.

ఇతర జిల్లాల నుంచి నకిలీ విత్తనాలు.. మిర్చి నారు..

గుంటూరు, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల నుంచి మహబూబాబాద్ జిల్లాకు ప్రభుత్వం అనుమతి లేని నకిలీ వితనాలు సరఫరా, మిర్చినారు వస్తుంది. జిల్లాలోని వివిధ గ్రామాల్లో కంపెనీల ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని రైతులకు విక్రయిస్తూ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. గిరిజన రైతుల అమాయకత్వాన్ని నిరక్ష రాస్యతను ఆసరా చేసుకొని రైతులకు నకిలీ విత్తనాలు అంటకట్టి నట్టేట ముంచుతున్నారు. గ్రామాలతో పాటు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు విత్తనషాపుల్లో నకిలీ మిర్చి విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. గత సంవత్సరం కూడా మానుకోటలో విక్రయించిన విత్తనాలు మిర్చిపంట పండక పోవడంతో అనేక గ్రామాల రైతులు విత్తన దుకాణాల ఎదుట ఆందోళనలు చేసిన ఘటనలు ఉన్నాయి. దీంతో రైతులకు కొంతమేర నష్టపరిహారం అందించి పోలీసు కేసులు కాకుండా జాగ్రత్తపడ్డారు. జిల్లాలోని గ్రామాల్లో వ్యవసాయ అధికారుల అప్రమత్తం, నిఘాలేక పోవడంతోనే నకిలీ విత్తనాల బెడద ఎక్కువైంది. మహబూబాబాద్ జిల్లాలో ఈ ఏడాదైనా విత్తన సీజన్‌లో టాస్క్‌ఫోర్స్ బృందాల నిఘా పెంచి నకిలీ విత్తనాలు రాకుండా అరికడతరా..? లేదా..! వేచి చూడాల్సిందే.

## సింగరేణి సూపర్ బజార్లకు గడ్డుకాలం

ఇల్లెందు : సింగరేణి యజమాన్యం కార్మిక అధికారుల కుటుంబాల కోసం సింగరేణి కాలరీస్ వ్యాప్తంగా నిత్యావసరాల సరఫరాల కోసం దుకాణాలు(సూపర్‌బజార్లు)ఏర్పాటు చేసింది. ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూర్, బూపాలపల్లి, గోదావరిఖని, శ్రీరాంపూర్, రామకృష్ణాపుర్, మందమర్రి, బెల్లంపల్లి, గోలేటి టౌనషిపలలో నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్ కౌంటర్లను కూడా ఏర్పాటు చేసింది. వీటి పర్యవేక్షణకు సింగరేణి ఒక మేనేజింగ్ డైరెక్టర్‌తోపాటు మూడు రీజియన్లకు ముగ్గురు డివిజనల్ మేనేజర్లను నియమించారు. అంతేగాక సేల్స్‌కౌంటర్లలో 90మందికి పైగా ఉద్యోగులు సింగరేణి సూపర్‌బజార్లలో విధులు నిర్వహిస్తున్నారు. నిరాదరణతోనే నష్టాలుసింగరేణి వివిధ ఏరియాల్లో అనేక యూజీలు మూతపడటం, కార్మికుల సంఖ్య తగ్గిపోవడం, వేర్వేరు ప్రాంతాలకు కార్మికుల బదిలీల కారణంగా కుటుంబాలు తరలిపోవడం వంటి కారణాలతో పాటు ప్రవేట్ వ్యాపారుల ఆఫర్లు, ఫ్యాకింగ్ ఆకర్షణలు సింగరేణి సూపర్‌బజార్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. నిజానికి సింగరేణి సూపర్‌బజార్లలో నిత్యావసర సరుకుల ధరలు, కాస్మొటిక్స్ ధరలు ప్రవేట్ దుకాణాలతో పోల్చితే తక్కువగా ఉంటాయి. అయితే అన్ని రకాల సరుకులు అందుబాటులో ఉండటం లేదన్న ఆవేదన కార్మిక కుటుంబాల్లో నెలకొంది. వివిధ ఏరియాల్లో డిమాండ్ మేరకు వస్తువులు సరఫరా చేయాలని ఇండెంట్లు పంపినప్పటికీ పూర్తిస్థాయిలో సరుకులు వినియోగదారులకు అందకపోవడంతో సింగరేణి కుటుంబాలు ప్రైవేటు దుకాణాల వైపే మొగ్గుచూపుతున్నారు. అంతేగాక పెద్ద మోత్తాల్లో సరుకులు దిగుమతి చేసినా కౌంటర్లలో విక్రయాల జాప్యం వల్ల సరుకులు పుచ్చిపోవడం వంటి నష్టాలను సెల్స్‌మెనలపై మోపుతుండటంతో వారు మొక్కుబడిగానే వి?ధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీలో కార్మిక కుటుంబాలు అధికంగా నివసిస్తుంటాయి. అయినా అక్కడి సూపర్‌బజార్ కౌంటర్‌ను మూసి వేశారు. ప్రతినెల రూ10వేలనుంచి రూ.20వేలకు మించి అమ్మకాలు జరగకపోవడం, కనీసం ఇద్దరు ఉద్యోగుల వేతనాలు కూడా చెల్లించేస్థాయిలో అమ్మకాలు లేకపోవడంతో దాన్ని మూసివేశారు. అయినా సెల్స్ కౌంటర్ తెరవాలని అటు కార్మికసంఘాలు కానీ, ఇటు కార్మికకుటుంబాలు కానీ యజమాన్యాన్ని కోరడంలేదంటే సూపర్‌బజార్ల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడెం రీజియనలోని సూపర్‌బజార్లే నష్టాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు ఏరియాల్లోని సూపర్‌బజార్ల కౌంటర్లు నష్టాల్లో కొనసాగుతుండగా కార్మిక కుటుంబాలు అధికంగా నివసించే ఏరియాల్లో మాత్రం లాభాల బాటలో సాగుతున్నాయి. వంటగ్యాస్ సరఫరాలో కీలకంనిత్యవసర వస్తువులతోపాటు వంటగ్యాసను సైతం సింగరేణి సూపర్‌బజార్లు అందిస్తున్నాయి. అయితే వంట గ్యాస్ ధరలు భారీగా పెరగడంతో పాటు కార్మిక కుటుంబాల్లో ఇనకంట్యాక్స్ భారం తగ్గించుకునేందుకు రెండు, మూడు నెలలకోక సిలిండర్ వినియోగిస్తున్నారు. అంతేగాక ఇల్లెందులాంటి ఏరియాల్లో గ్యాస్ డోర్‌డెలవరీలో వినియోగదారుల నుంచి అధికమెత్తాల్లో డబ్బు దండుకుంటున్న తీరుతో సూపర్‌బజార్లపై కార్మిక కుటుంబాల్లో వ్యతిరేకత ఏర్పడింది. సింగరేణిలో డోర్‌డెలవరీకి సంబందించి రవాణా చార్జీలను యజమాన్యమే చెల్లిస్తున్నప్పటికీ ఇల్లెందు ఏరియాలో ఒక్కో సిలిండర్‌కు రూ.20నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. ఐదు కిలోమీటర్ల పరిధివరకు ఉచితంగా డోర్ డెలవరీ చేయాల్సి ఉన్నప్పటికీ అధికారుల పట్టించుకోవడం లేదన్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మిక కుటుంబాల ఆదరణ కీలకం డివిజనల్ మేనేజర్ వరప్రసాద్‌ప్రవేట్ వ్యాపార సంస్థలతో పోల్చితే సింగరేణి సూపర్‌బజార్లలో నిత్యావసర, ఫ్యాన్సీ తదితర వస్తువుల ధరలు తక్కువగానే ఉన్నాయి. కార్మికులు, అధికారులకు సూపర్‌బజార్లలో నెలకు రూ.10వేల క్రెడిట్ సౌకర్యం కూడా యజమాన్యం కల్పించింది. సింగరేణి కుటుంబాల ఆదరణ లభిస్తే సూపర్‌బజార్ల సేవలు మరింత విస్తృతం చేస్తాం.

## మళ్లీ ట్యాంకర్లు

ఇల్లెందు : : ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉందన్న విమర్శలు అల్లాదుర్గం మండలంలో వెల్లువెత్తుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్‌భగీరథ పథకం అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. ఫలితంగా ప్రజలు తాగునీటి కోసం అల్లాడే పరిస్థితి ఏర్పడింది. అల్లాదుర్గం మండలంలోని వెంకట్రావుపేటలో మూడేళ్లుగా మిషన్‌భగీరథ పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు నిలిచిపోయింది. అయితే సర్పంచ్ బాలమణి ఆర్‌డబ్ల్యూఎస్ పథకం కింద ఏర్పాటు చేసిన బోరు ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. వారం, పదిరోజులుగా గ్రామంలో పలు కాలనీల్లో నీటిసరఫరా అంతంత మాత్రంగా వస్తుండడంతో తాగునీటికి సమస్య తీవ్రమవడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా భూగర్భజాలాలు అడుగంటి, తాగునీటి బోర్లు పనిచేయకపోతే సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉందని, ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో మిషన్‌భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తుంటే తమ గ్రామానికి ఎందుకు ఇవ్వడం లేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతస్థాయి అధికారులు స్పందించకుంటే మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామంటు వెంకట్రావు పేట గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

పనులు మానుకుని నీటి కోసం ఎదురుచూపులు

– రేగోటి శమంత, వెంకట్రావుపేటఇతర గ్రామాలకు మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేస్తూ మా ఊరికి మాత్రం ఎందుకు ఇవ్వరు. గ్రామంలో ఏర్పడిన తాగునీటి ఎద్దడితో ప్రతిరోజు ట్యాంకర్ కోసం ఉపాధి పనులు మానుకుని ఎదురుచూడాల్సి వస్తుంది. రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత జఠిలం అయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

అధికారులకు విన్నవించాం– బాలమణి, సర్పంచ్ వెంకట్రావుపేటమూడేళ్లుగా గ్రామానికి మిషన్ భగీరథ కింద తాగునీరు సరఫరా కావడం లేదని ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా అధికారులు స్పందించడం లేదు. గ్రామంలో రోజురోజుకు జఠిలమవుతున్న తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామ పంచాయతీ తాగునీటి ట్యాంక్ ద్వారా ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తున్నాం. ఉన్న ఒక్క బోరులోని నీరు అడుగంటితే గ్రామంలో నీటిఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉంది.



# రాజధాని నిర్మాణ సామగ్రి అగ్నికి ఆహుతి

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. నెక్కల్లు శివారులో రాజధాని నిర్మాణం కోసం తీసుకొచ్చిన సామగ్రిని నిల్వ ఉంచారు. భారీ ఎత్తున ప్లాస్టిక్ పైపులు, మురుగు నీటి కాలువల కోసం తీసుకొచ్చిన పైపులను డంప్ చేశారు. గత నాలుగేళ్లుగా అదే ప్రాంతంలో పైపులు ఉండటంతో వాటికి తేనెతుట్టెలు పెరిగిపోయాయి.

తేనె తీసుకునేందుకు వచ్చిన కొందరు వ్యక్తులు పొగబెట్టే ప్రయత్నంలో మంటలు పైపులకు అంటుకున్నాయి. ఎండలు, గాలికి క్షణాల్లో మంటలు వ్యాపించడంతో పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. భారీగా నష్టం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పవిత్ర రంజాన్ సందర్భంగా సౌదీ అరేబియాలోని మక్కా మసీదులో సామూహిక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు







# ముందస్తు బెయిల్‌పై సుప్రీం స్టే

దిల్లీ: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ అంశంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఈ నెల 25 వరకూ అవినాష్‌ను అరెస్ట్ చేయొద్దంటూ తెలంగాణ హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను వివేకా కుమార్తె డాక్టర్ సునీత సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ అంశంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఆ ఉత్తర్వులు ఆమోదయోగ్యమైనవి కాదని అభిప్రాయపడింది. అవినాష్‌కు ముందస్తు బెయిల్ ఇస్తే కేసు విచారణపై దాని ప్రభావం పడుతుందని సీబీఐ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో ప్రలోభాలు కూడా పనిచేశాయని చెప్పారు. అనంతరం ధర్మాసనం స్పందిస్తూ ఈనెల 24న పూర్తిస్థాయి విచారణ చేపడతామని.. అప్పుడు అన్ని విషయాలను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. ఈనెల 24 వరకు అవినాష్‌ను అరెస్ట్ చేయొద్దని సీబీఐని ఆదేశించింది.

ఈనెల 30లోపు కేసు విచారణ పూర్తిచేయాలంటూ గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను పొడిగిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది.

# లోకేష్ కోసం పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చిన మహిళలు.. ఆదోని టౌన్‌లోకి యువగళం



కర్నూలు: టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఆదోని టౌన్‌లోకి చేరుకోవడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ప్రస్తుతం యువగళం పాదయాత్ర ఆదోని టౌన్‌లో కొనసాగుతోంది. ఈ సందర్భంగా లోకేష్‌ను చూసేందుకు మహిళలు, యువత, వృద్ధులు పెద్ద ఎత్తున రోడ్లపైకి తరలివచ్చారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని.. పన్నుల భారంతో బతుకు భారంగా మారిందని లోకేష్‌కు మహిళలు తమ బాధను చెప్పుకున్నారు. ఉద్యోగాలు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకోవాల్సి వస్తుందని యువత ఆవేదన వ్యక్తం చేసింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు, పన్నులు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని మహిళలకు లోకేష్ అభయమిచ్చారు. స్థానికంగా పరిశ్రమలు తీసుకొచ్చి ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని యువతకు లోకేష్ హామీ ఇచ్చారు.

**ఆదోని బైపాస్ బాధితుల వినతిపత్రం :** అనంతరం పాదయాత్ర చేస్తున్న లోకేష్‌ను ఆదోని బైపాస్ బాధితులు కలిసి వినతిపత్రం అందజేశారు. నేషనల్ హైవే 167లో భాగంగా ప్రతిపాదించిన ఆదోని బైపాస్ రోడ్డు ఎలైన్ మెంట్ -2 ఆదోని పట్టణ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమైనదని తెలిపారు. దీనివల్ల 40 సంవత్సరాల క్రితం ఆమోదించిన లేఅవుట్లు, ఆవాసాలు దెబ్బతిని, 40 ఏళ్ల నుంచి ఉ ంటున్న 400 కుటుంబాలను ప్రభావితం చేస్తోందన్నారు. కేవలం కొద్దిపాటి వ్యవసాయ భూములు మాత్రమే ప్రభావితమయ్యే ఎలైన్ మెంట్ – 3ని పరిగణనలోకి తీసుకొని బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే, ఆయన మనుషులకు చెందిన భూములకు విలువ పెంచుకునేందుకు, ఆ భూములకు సమీపం గుండా జాతీయరహదారి వెళ్లేలా ఎలైన్ మార్పులు చేస్తున్నారని తెలిపారు. ఆదోని పట్టణంలో 4 దశాబ్దాలుగా నివసించే ప్రజలకు నష్టం జరగకుండా ఎలైన్ మెంట్ -3 ప్రకారం బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. యువనేత నారా లోకేష్ స్పందిస్తూ... వైసీపీ నేతలు వారి స్వార్థం కోసం ఎన్ని వందలమంది ప్రయోజనాలైనా దెబ్బతీయడానికి వెనకాడటం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరుల భూములు రేట్లు పెంచుకునేందుకు ప్రజలను ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. ఆదోని మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా ఎలైన్ మెంట్ మార్పుపై హైవే అథారిటీకి లేఖరాస్తామని చెప్పారు. ఆదోని బైపాస్ రోడ్డు బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా నిలుస్తామని యువనేత హామీ ఇచ్చారు.

# గన్నవరం తెదేపా టికెట్‌కు 10మంది పోటీ: చింతమనేని ఆసక్తికర వ్యాఖ్యలు



గన్నవరం గ్రామీణం: 'నేను ఉన్నాను.. నేను విన్నాను' అంటూ కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైకాపా సర్కార్ వెంటిలేటర్‌పై ఉ ందని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పాత గన్నవరంలో నిర్వహించిన తెదేపా అధినేత చంద్రబాబు పుట్టినరోజు, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గన్నవరంలో ఏమి జరుగుతుందోనని కార్యకర్తలు, నాయకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అక్కడ టిక్కెట్ కావాలంటూ 10 మంది వరకు పోటీపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లోని గ్రామాల్లో వైకాపా సైకోలు తయారయ్యారని విమర్శించారు. బాబాయ్ హత్యను అడ్డం పెట్టుకొని రాజకీయ వ్యభిచారం చేసిన ముఖ్యమంత్రి జగన్.. చెల్లికి న్యాయం చేయకుండా రాష్ట్రానికి ఏ విధంగా న్యాయం చేస్తారంటూ చింతమనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో గన్నవరంలో భూముల విలువ ఎంత ఉంది? ప్రస్తుతం ఎంతుందో గమనించాలని సూచించారు. విమానాశ్రయంలో విమానాల రాకపోకలను కూడా పరిశీలించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత, అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉ ంగుటూరులో స్వర్గీయ ఎన్టీఆర్ దంపతుల విగ్రహాల ఆవిష్కరణ అనంతరం తన రాజకీయ ప్రయాణం తెలియజేస్తానని మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు తెలిపారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో చింతమనేని, బాలవర్ధనరావు ప్రత్యేక పూజలు చేశారు. టౌన్ పార్టీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు, నాయకులు గూడపాటి తులసీమోహన్, దొంతు చిన్నా, మండవ లక్ష్మి, జాస్తి ఫణికుమార్, అబుల్యాజ్, నరసయ్య, హరికృష్ణ, బాబూరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి డౌన్.. హైదరాబాద్ అప్..

## ఒక్కరోజే 24 ఒప్పందాలు!

హైదరాబాద్ / అమరావతి : ఏపీ అమరావతిని వైసీపీ ప్రభుత్వం అణిచి వేయడంతో పొరుగున ఉన్న తెలంగాణలోని హైదరాబాద్ పెట్టుబడుల పరంగా.. రియ ల్ ఎస్టేట్ పరంగా.. వ్యాపారాల పరంగా పుంజుకుంది. ఇటీవల మంత్రి కేటీఆర్ అన్నట్టుగా.. అమరావతి నిర్మాణాలు జోరుగా జరు గుతున్న 2016-18 మధ్య కాలంలో హైదరాబాద్ ఆదాయం తగ్గిపోయింది. అంతేకాదు.. రియల్ వ్యాపారాలు కొత్త కొత్త ఆఫర్లు ప్రకటించిన అప్పటి చంద్రబాబు ప్రభుత్వం వైపు మొగ్గు చూపారు. అమరావతిలో వాలిపోయారు. అయితే.. ఎప్పుడైతే.. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయి.. వైసీపీ సర్కారు వచ్చిందో.. అందరి ఆశలూ పటాపంచలయ్యాయి. నిజానికి చంద్రబాబు కన్నా కూడా జగన్ వ్యాపారవేత్త. ఆయన చేతిలో అనేక వ్యాపారాలు ఉన్నాయి. దీంతో రాజధాని మరింత ఇనుమడిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ 2020 ప్రారంభంలోనే ఆయన మూడు రాజధానులు ప్రకటించడం.. తర్వాత.. ఉద్దేశ పూర్వంగా అమరావతిని తొక్కిపెట్టడంతో ఇక్కడి వ్యాపారాలు కకావికలం అయ్యాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగం పెట్టుబడులు వ్యాపారులు అందరూ కూడా ఏపీ అంటేనే ఛీదరించుకునే పరిస్థితి వచ్చింది. ఆ వెంటనే హైదరాబాద్ ప్రభుత్వం.. వ్యూహాత్మకంగా వీరికి స్వాగతం పలికింది. అంతేకాదు.. హైదరాబాద్ శివారును మరింత విస్తరించింది. దీంతో పెట్టుబడులు వ్యాపారాలు పెరిగిపోయాయి. తాజాగా మంగళవారం ఏకంగా 24 ఒప్పందాలు జరిగినట్టు సమాచారం. తాజాగా హైదరాబాద్ నగరం సాధిస్తున్న అభివృద్ధిని వివరిస్తూ.. CBRE సౌత్ ఏషియా ప్రైవేట్ లిమిటెడ్ విడుదల చేసిన 'ఇండియన్ రియల్ ఎస్టేట్ బెట్టింగ్ ఆన్ ఎ క్యాపిటల్ ఫ్యూచర్'నివేదికలో మరిన్ని ఆశ్చర్యగొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. ఈ నివేదిక ప్రకారం.. 2018 2022 మధ్య హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలోకి 2.24 బిలియన్ డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు వచ్చాయి. 2018 నుంచి సేకరించిన మొత్తం భూమిలో 14 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్న నగరంగా హైదరాబాద్ రికార్డు సృష్టించింది. అంతేకాదు దేశంలో రెండో అత్యధిక భూ సేకరణ కార్యకలాపాలను కూడా భాగ్యనగరం నమోదు చేసింది. 2018 నుంచి చేసిన మూలధన విస్తరణలో ఎక్కువ భాగం కోర్ కోర్-ప్లస్ పెట్టుబడి వ్యూహాల ద్వారా జరిగింది. 2018 నుంచి దేశంలో క్రాస్-రీజినల్ ఇన్వెస్టర్లు దాదాపు 47 శాతం పెట్టుబడులు పెట్టారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ డెవలపర్లు 13 బిలియన్ డాలర్లకు పైగా హైదరాబాద్లో పెట్టుబడి పెట్టారు. పెట్టుబడులు వ్యాపారాలు సంస్థాగతంగా 56 శాతానికి పైగా పెరిగాయి. ఉద్యోగుల శాతం పెరిగింది. అంతేకాదు.. ఈ నివేదిక వచ్చే రెండేళ్లలో హైదరాబాద్ ఎలా ఉంటుందో కూడా వివరించింది. రాబోయే రెండేళ్లలో 16-17 బిలియన్ల ఇన్ఫోతో పెట్టుబడులు పెరుగుతాయని కూడా నివేదిక పేర్కొంది. నగర విస్తీర్ణం సేకరించిన భూముల విస్తీర్ణంలో పెట్టుబడుల విషయంలో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉండగా.. మహారాష్ట్ర రాజధాని ముంబై రెండు స్థానంలో బెంగళూరు మూడో స్థానంలో హైదరాబాద్ 4వ స్థానంలో నిలిచాయి. కానీ అమరావతి పుంజుకున్న దశలో హైదరాబాద్ వెనుక బడిందని.. స్వయంగా కేటీఆర్ ప్రకటించడం గమనార్హం. కానీ వైసీపీ నిర్ణయంతో ఏపీ ఎక్కడా తన ఉనికిని చాటుకునే అవకాశం లేకుండా పోయింది.




# కర్ణాటకలో పవన్ ఎన్నికల ప్రచారంపై కొనసాగుతున్న సందిగ్ధత

అమరావతి: కర్నాటక ఎన్నికల నేపథ్యంలో బీజేపీతో పొత్తులో ఉన్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ విషయంలో బీజేపీలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. తెలుగువారు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ తరుపున పవన్ ప్రచారం చేస్తారని బీజేపీ భావించింది. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్‌తో ఇప్పటికే బీజేపీ యువమోర్చా జాతీయ అధ్యక్షుడు తేజస్వీ సూర్య రెండుసార్లు భేటీ అయ్యారు. అయితే కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పవన్ కళ్యాణ్ పాల్గొనేదానిపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. పొత్తులో ఉన్నారు కాబట్టి పవన్ ప్రచారానికి వస్తారని బీజేపీ నేతలు అంటున్నారు. కాగా పవన్ ఎన్నికల ప్రచారంపై జనసేన వర్గాలు మౌనంగా ఉన్నాయి. కర్నాటక ఎన్నికల ప్రక్రియలో ప్రచారం అత్యంత కీలక పర్వం. విజయం సాధిస్తే ప్రజలకు తాము ఏం చేయబోయేది... రాజకీయ ప్రత్యర్థుల కంటే తాము ఏవిధంగా మెరుగైన అభ్యర్థులమో ఓటర్లకు తెలియజెప్పే ఘట్టం ఇది. ఇక ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకునేందుకు వాగ్దానాలు, హామీలు గుప్పించేందుకు కీలకమైన దశ కూడా ఇదే. అందుకే పోలింగ్‌కు ముందు జరిగే ప్రచారపర్వం రాజకీయ పార్టీలకు ఎంతో ముఖ్యమైనది. ఎన్నిక ఏదైనా.. ఎక్కడైనా ఇదే ఒరవడి కనిపిస్తుంది. మరో 20 రోజుల్లోనే అసెంబ్లీ ఓటింగ్‌కు వెళు తున్న దక్షిణాది రాష్ట్రం కర్ణాటకలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్ది ప్రధాన పార్టీలు నువ్వా-నేనా అన్నట్టు ప్రచారం కొనసాగిస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి నేతలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఉధృతంగా ప్రచారం సాగిస్తున్నారు. కాగా ఎన్నికల సమయం మరింత చేరువవుతుండడంతో ఓటర్లకు చేరువయ్యేందుకు నేతలు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు.

# ఆర్-5 జోన్‌లో జంగిల్ క్లియరెన్స్.. అడ్డుకున్న కృష్ణాయపాలెం రైతులు



అమరావతి: రాజధాని ప్రాంతంలోని ఆర్-5 జోన్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులను రైతులు అడ్డుకున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పేదలకు రాజధాని పరిధిలో సెంటు భూమి ఇచ్చేందుకు వీలుగా కృష్ణాయపాలెంలో జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు సీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది జేసీబీ వాహనాలతో వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక రైతులు హుటాహుటిన అక్కడికి చేరుకుని జంగిల్ క్లియరెన్స్‌ను అడ్డుకున్నారు. జేసీబీలను వెనక్కి పంపారు. ఆర్-5 జోన్ అంశం హైకోర్టు పరిధిలో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ, అవినాష్‌రెడ్డి వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ప్రభుత్వం ఈ కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు.

## శాకుంతలం కంటే మత్తుగా స్టన్నింగ్ లుక్

స్టార్ హీరోయిన్ సమంత వరుస సినిమాల్లో నటిస్తూ ప్రస్తుతం చాలా బిజీగా గడుపుతున్నారు. ఓ వైపు ఆరోగ్యం బాగాలేక చికిత్స పొందుతూనే షూటింగ్ లో పాల్గొంది. కొన్నాళ్లు బ్రేక్ తీస్కొని.. తన ఆరోగ్యాన్ని బాగు చేసుకుంది. ఇక అప్పటి నుంచి శాకుంతలం సినిమా ప్రమోషన్ పనులతో బిజీగా మారిపోయింది. ఎప్పటికప్పుడు ఇంటర్వ్యూలు ఇస్తూ... తెగ సందడి చేసింది. కేవలం సినిమాల ద్వారానే కాకుండా సోషల్ మీడియా వేధికగా కూడా ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత తన ఇన్ స్టా గ్రామ్ వేధికగా ఓ ఫొటో షేర్ చేసింది. అందులో సమంత అచ్చం మత్స్య కన్యలా కనిపిస్తోంది. అందుకు కారణం ఆమె వేసుకున్న ఔట్ ఫిట్ యే. మత్స్యకన్య లా లుక్కిచ్చే బ్లాక్ కలర్ ఔట్



ఫిట్ లో అదిరిపోయింది. పైన బ్లౌజ్ కింద బ్లాక్ కలర్ మిడ్డీ వేసుకుంది. పైనుంచి కిందకు వచ్చే సిరికి కుషించుకుపోయినట్లు కనిపించే ఈ డ్రెస్సులో సామ్ చాలా స్టైలిష్ గా కనిపిస్తోంది. అలాగే బ్లాక్ కలర్ నెయిల్ పాలీష్ బ్లాక్ హీల్స్ వేసుకొని ఫొటోలకు ఫోజులు ఇచ్చింది. మెడలో పాము లాగా ఉన్న ఓ సిల్వర్ జ్యువెల్లరీ చేతికి పాములా చుట్టుకొని ఉన్న రెండు వరుసల బ్రేస్ లేట్ పెట్టుకుంది. ఇయర్ రింగ్స్ కూడా ఇలాంటివే పెట్టుకుంది. ఇందులో సామ్ నడుము అందాలతో పాటు ఒంపుసొంపులు చక్కగా కనిపిస్తున్నాయి. నడుమైతే నయాగారా ఫాల్స్ లా మెలికలు తిరిగి కనిపిస్తోంది. పైన కొప్పు పెట్టుకున్న సామ్.. కొంచెం జుట్టును ముందుకు వేసుకొని అదిరిపోయే లుక్కులో దర్శనం ఇచ్చింది. సామ్ పోస్ట్ చేసిన ఈ ఫొటోలు చూసిన అభిమానులు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అదిరిపోయావు చాలా అందంగా ఉన్నావు రోజురోజుకూ నీ అందం పెరుగుతోందంటూ చెబుతున్నారు. ప్రస్తుతం సామ్ ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఆమె వేసుకున్న జ్యువెల్లరీ మరింత ట్రెండ్ అవుతోంది. సమంత హీరోయిన్ గా నటించిన తాజా చిత్రం శాకుంతలం ఏప్రిల్ 14వ తేదీన విడుదల అయింది. టాలీవుడ్ దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రం డిజాస్టర్ గా నిలిచింది.

## అమితాబ్ తో రొమాన్స్.. ఆ హీరోయిన్ కి వార్నింగ్ ఇచ్చిన ఖుష్బూ..!


కోలీవుడ్ స్టార్ హీరోయిన్ ఖుష్బూ గురించి అందరికీ తెలిసిందే. ఉన్నది ఉన్నట్టుగా ముక్కుసూటిగా మాట్లాడే ఖుష్బూ హీరోయిన్ గా అప్పటి ప్రేక్షకులను అలరించగా ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. తమిళ్ సినిమాలే కాదు తెలుగులో కూడా ఆమె వరుస సినిమాలు చేస్తున్నారు. సినిమాలే కాదు జబర్దస్త్ షోలో పార్ట్ టైం జడ్జ్ గా ఉంటున్నారు. ప్రస్తుతం జబర్దస్త్ జడ్జిగా ఇంద్రజ కృష్ణ భగవాన్ ఉంటున్నారు. వీరిలో ఏ ఒక్కరు మిస్సైనా ఖుష్బూ అక్కడ ప్రత్యక్షమవుతుంది. లేటెస్ట్ గా గోపీచంద్ హీరోగా వస్తున్న రామబాణం సినిమాలో కీలక పాత్రలో నటించారు ఖుష్బూ. ఈ క్రమంలో లేటెస్ట్ గా ఓ స్పెషల్ చిట్ చాట్ లో పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూలో భాగంగా ఆమె హీరోయిన్ టబుకి వార్నింగ్ ఇచ్చిన విషయాన్ని చెప్పుకొచ్చారు ఖుష్బూ. అమితాబ్ అంటే



ఎంతో ఇష్టమని చెప్పిన ఖుష్బూ చినీకం సినిమాలో టబు అమితాబ్ తో కలిసి రొమాన్స్ చేయడం తట్టుకోలేకపోయానని అన్నారు. చిన్నప్పుడు అమితాబ్ తో కలిసి నటించాను పెద్దయ్యాక కుదరలేదు. అయితే తనకు రాని ఆ ఛాన్స్ టబు దక్కించుకున్నందుకు ఆమెకు ఫోన్ చేసి మరీ తిట్టిందట. అమితాబ్ తో రొమాన్స్ చేస్తే తాను చేయాలి నువ్వెందుకు చేశావ్.. ఆయనతో రొమాన్స్ చేసే హక్కు అర్హత తనకే ఉన్నాయని చెప్పిందట. అలా అమితాబ్ పై తనకు ఉన్న ఇష్టాన్ని వెల్లడించింది ఖుష్బూ. చిరంజీవి బాలకృష్ణతో కూడా కలిసి నటించే అవకాశం కూడా చూస్తున్న అంటూ చెప్పారు. ఆ అవకాశం ఎప్పుడు వస్తుందో చూడాలి అలాంటి ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నా అన్నారు ఖుష్బూ.. తెలుగులో ఎలాగు సినిమాలు చేస్తున్నా కాబట్టి త్వరలోనే అలాంటి ఛాన్స్ అందుకుంటానని నమ్మకం ఉందని అన్నారు. పవన్ కళ్యాణ్ తో అజ్ఞాతవాసి సినిమాలో నటించిన ఖుష్బూ ఆ సినిమా ఎందుకు ప్రేక్షకులకు నచ్చలేదో తనకు అర్థం కాలేదని అన్నారు. బహుశా పవన్ మదర్ గా తనని యాస్పెక్ట్ చేయలేదని అన్నారు. మా మధ్య మ్యూజిక్ మిస్ అయ్యి ఉండొచ్చని అన్నారు.




## పంత్ కి పోటీగా జడేజా.. ఊర్వశి నామస్మరణం!





హేట్ స్టోరి 4 బ్యూటీ ఊర్వశి రౌతేలా అందాలకు క్లీన్ బౌల్డ్ కానిది ఎవరు? ముఖ్యంగా టీమిండియా క్రికెటర్లు ఇప్పటికే ఒక్కొక్కరుగా స్టంప్ అవుట్ అయిపోతున్నారు. ఇటీవల ఊర్వశి లవర్ అంటూ రిషబ్ పంత్ పేరు ప్రముఖంగా వినిపించింది. అతడు ఊర్వశి పిలుపు కోసం ఐదు నక్షత్రాల హోటల్ లాంజ్ లో గంటల కొద్దీ సమయం వెచ్చించాడని కథనాలొచ్చాయి. అనంతరం ఊర్వశి ప్రకటనతో పంథ్ గందరగోళంలో పడ్డాడు. అయితే అభిమానులు మాత్రం ఈ జంట ఎంతో బావుంటుందని కితాబిచ్చేశారు. ఆ తర్వాత మరో యువక్రికెటర్ నసీమ్ షా కూడా ఊర్వశి అందచందాలకు క్లీన్ బౌల్డ్ అయిపోయాడు. ఇంకా ఊర్వశి జాబితాలో పలువురి పేర్లు చేరుతూనే ఉన్నాయి. క్రికెటర్లకు ఊర్వశి పేరును లింకప్ చేయడంతో సోషల్ మీడియాలో తరచుగా చర్చనీయాంశమైంది. తాజాగా ఊర్వశి అందాలకు పడిపోయిన వారి జాబితాలోకి మరో క్రికెటర్ చేరిపోయాడు. టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఒక న్యూస్ పోర్టల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఊర్వశిపై తన అభిమానాన్ని దాచుకోలేకపోయాడు. అతడి వ్యాఖ్యలు అప్పటి నుండి సోషల్ మీడియాల్లో వైరల్ గా మారాయి. బాలీవుడ్ నటీమణుల్లో ఎవరు సెక్సీ? అని హోస్ట్ అడిగినప్పుడు.. జడేజా వెంటనే ఊర్వశి రౌతేలా పేరును ప్రస్తావించాడు. ఈ ప్రకటన ఊర్వశికి క్రికెటర్లలో పెరుగుతున్న క్రేజ్ ను మరింత పెంచింది. రిషబ్ పంత్ వర్సెస్ ఊర్వశి రౌతేలా వివాదం ఇప్పటికీ ముగిసిపోలేదు. పంథ్ ప్రమాదం తర్వాత ఆసుపత్రిలో చేరినప్పటికీ 5 జనవరి 2023న ముంబైలోని కోకిలాబెన్ హాస్పిటల్ కి ఊర్వశి చేరుకున్నప్పటి ఫోటోలు వైరల్ అయ్యాయి.

అక్కడ పంత్ గాయానికి చికిత్స పొందుతుండగా తాను ఎందుకు చేరుకుంది? అంటూ ప్రశ్న తలెత్తింది. రౌతేలా దానిపై ఎలాంటి నిర్దిష్ట వివరాలను ప్రస్తావించకపోయినా.. క్రికెటర్ కోసమే ఆస్పత్రికి వచ్చిందన సోషల్ మీడియాలో కథనాలొచ్చాయి. కానీ ఊర్వశి వ్యవహారంపై పంథ్ అభిమానులు మాత్రం సీరియస్ గా స్పందిస్తున్నారు. వరుసగా యువక్రికెటర్లు ఊర్వశి వల్లో పడిపోవడం కొంత కంగారు పెట్టే వ్యవహారమే.

## హిట్ సెంటిమెంట్ కోసం ఆమెను ఇరికించే ప్రయత్నం



బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ సుదీర్ఘ కాలం తర్వాత పఠాన్ చిత్రం తో ఒక భారీ బ్లాక్ బస్టర్ సక్సెస్ ను దక్కించుకున్నాడు. పఠాన్ సినిమా వెయ్యి కోట్లకు పైగా కలెక్షన్స్ రావడంతో షారుఖ్ ఖాన్ అభిమానులు మరియు ఇండస్ట్రీ వర్గాల వారు అంతా కూడా ఆయన తదుపరి సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. అట్లీ దర్శకత్వంలో షారుఖ్ ఖాన్ తదుపరి సినిమా జవాన్ రూపొందుతున్న విషయం తెల్సిందే.

జవాన్ సినిమా లో నయనతార కీలక పాత్రలో కనిపించబోతుంది. మరో ఇద్దరు ముద్దుగుమ్మలు కూడా ఈ సినిమాలో నటిస్తున్నారు. అయినా కూడా మరో హీరోయిన్ దీపికా పదుకునేను ఈ చిత్రంలో నటింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జవాన్ సినిమా లో దీపికా పదుకొనేను కనీసం ఒక్క పాటలో అయినా చూపించాలని షారుఖ్ ఖాన్ పట్టుబట్టినట్లుగా తెలుస్తోంది. దాంతో దర్శకుడు అట్లీ వీరిద్దరి కాంబోలో ఒక మాస్ బీట్ ఐటం సాంగ్ ను ప్లాన్ చేసినట్లుగా బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

పఠాన్ సినిమాలో దీపికా పదుకొనే నటించడం వల్లే వెయ్యి కోట్లు వచ్చాయి అనే ఉద్దేశ్యంతో మేకర్స్ మళ్లీ ఆమెను జవాన్ లో కూడా నటింపజేసే ప్రయత్నం చేశారు. లక్కీ ఛామ్ అయిన దీపికా పదుకునే ను జవాన్ లో చూపిస్తే లక్ కలిసి వస్తుందని కొందరు నమ్ముతున్నారు.. కొందరు మాత్రం విడ్డూరంగా ఉందంటూ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. మొత్తానికి షారుఖ్ ఖాన్ జవాన్ సినిమా లో చివరి దశలో దీపికా పదుకొనే ను ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. కేవలం సెంటిమెంట్ కోసం ఆమెను తీసుకు వచ్చేందుకు సిద్ధం అవ్వడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు పెదవి విరుస్తున్నారు.

## పవన్ తో డేట్ కి రెడీ.. మామ్ ఫ్యానిజంపై కుమార్తె..!

స్టార్లను పిచ్చిగా అభిమానించడం కేవలం సామాన్య ప్రజల వరకే పరిమితం కాదు. సినీపరిశ్రమలో సెలబ్రిటీలుగా ఉన్నవారికి కూడా అంతే పిచ్చి. ఒకవేళ డేట్ కి వెళ్లాల్సి వస్తే ఏ హీరోతో అయితే మీకు ఓకే? అని ప్రశ్నించినా దానికి నిర్మొహమాటంగా తమ ఫేవరెట్ హీరో గురించి ఓపెనవ్వడమే కాదు.. డేట్ కి వెళ్లేందుకు సిద్ధమేనని చెప్పేందుకు వెనకాడరు. గత కొన్నేళ్లుగా కుమార్తె సుప్రీతతో కలిసి సోషల్ మీడియా ఫోటోషూట్లు వీడియో షూట్లతో చెలరేగుతున్న సహాయనటి సురేఖావాణి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కి వీరాభిమాని అన్న సంగతి ఎవరికీ తెలియదు. తాజా ఇంటర్వ్యూలో మామ్ అండ్ డాటర్ పవర్ స్టార్ పై ఉన్న అభిమానం గురించి ప్రస్థావించారు.



ఒకవేళ మీ అమ్మ గారు డేట్ కి వెళ్లాల్సి వస్తే ఏ హీరోతో వెళతారు? అని ప్రశ్నించగా సుప్రీత దానికి సమాధానమిచ్చారు. నిరభ్యంతరంగా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అంటే అమ్మకు అభిమానం. ఆయనతో డేట్ కి వెళ్లేందుకు అభ్యంతరం లేదు.. కింగ్ నాగార్జున అన్నా అంతే అభిమానం.. అని మమ్మీ మనసులో మాటను వెల్లడించింది. దానిని సురేఖావాణి తనవైన హావభావాలతో కన్ఫామ్ చేసారు. వంద ముద్దులు పెట్టాల్సి వస్తే ఏ హీరోకి? అని ప్రశ్నించగానే పవన్ కల్యాణ్ అంటూ చెప్పారు సురేఖ. డేటింగ్ అంటే ఒక వ్యక్తి కోసం కొంత విలువైన సమయం వెచ్చించడం.. అభిరుచులను షేర్ చేసుకోవడం.. అంతవరకే ఇమాజినేట్ చేయాలి. అంతకుమించి డేటింగ్ పై నానార్థాలు తీయకూడదు. తాము అభిమానించే తారలతో డేట్ కి వెళ్లడం ఫోటోలు లేదా సెల్ఫీలు దిగడం సర్వసాధారణమైన ప్రక్రియ. జనరేషన్ గ్యాప్ తో దీనిని అర్థం చేసుకునే విధానం కూడా మారిపోతోంది. పవన్ కల్యాణ్ – నాగార్జున సురేఖావాణి ఫేవరెట్ హీరోలు. అందుకే వీళ్లతో డేటింగుకి ఓకే అన్నమాట! ఇక కుమార్తెను కథానాయికగా తీర్చిదిద్దేందుకు సురేఖావాణి ప్రయత్నిస్తున్నారని కథనాలొస్తున్నాయి.

## గ్లామర్ డోస్ బాగా పెంచిన అర్జున్ రెడ్డి బ్యూటీ

అర్జున్ రెడ్డి చిత్రంతో హీరోయిన్ గా ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ షాలిని పాండే మొదటి సినిమా తోనే బ్లాక్ బస్టర్ సక్సెస్ ని దక్కించుకుంది. ఇలాంటి ప్రియురాలు కావాలని ప్రతి ఒక్క కుర్రాడు అనుకునే విధంగా ఆ సినిమాలో షాలిని పాండే నటించింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతగా ఆకట్టుకున్నా కూడా అదృష్టం సరిగా లేక పోవడంతో ముద్దుగుమ్మకు ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. అర్జున్ రెడ్డి పాత్రలో నటించిన విజయ్ దేవరకొండ టాలీవుడ్ స్టార్ అవ్వగా.. ఆయన ప్రియురాలి పాత్రలో నటించిన షాలిని పాండే మాత్రం సక్సెస్ లు లేకపోవడంతో



కొన్ని సినిమాలకే పరిమితం అయ్యింది. ప్రస్తుతం తెలుగు తో పాటు ఇతర భాషల్లో చిన్నా చితకా సినిమాలు చేస్తున్న షాలిని పాండే మరో వైపు భారీ ఎత్తున సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ అందరిని సర్ ప్రైజ్ చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన అందాల ఆరబోత ఫొటోలు షాకింగ్ గా ఉన్నాయి.

మిర్రర్ ముందు నిల్చుని క్లీ వేజ్ షో చేస్తూ అందాల విందు చేస్తూ ఫొటోలకు ఫోజ్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో షాలిని పాండే అందాల ఆరబోత కామన్ అయ్యింది. తాజాగా ఈ ఫొటోలను చూస్తూ ఉంటే ఈ మధ్య కాలంలో అర్జున్ రెడ్డి బ్యూటీ అందాల ఆరబోత మరింత ఎక్కువ అయ్యిందనే టాక్ వినిపిస్తుంది.



# గతుకుల గజ్వేల్‌ను బతుకుల నిలయంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట : గతుకుల గజ్వేల్‌ను బతుకుల నిలయంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు.

గజ్వేల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. గజ్వేల్ అభివృద్ధి చెందిందో.. లేదో.. గుండె మీద చేయి వేసుకొని చెప్పాలన్నారు. ఎవరైనా గజ్వేల్‌కు ఏం చేశారని అడిగితే సీఎం కేసీఆర్ అన్ని చేశారని చెప్పాలన్నారు. గజ్వేల్‌కు సీఎం కేసీఆర్ రింగ్‌రోడ్డు, పార్కులు, రైల్వేస్టేషన్, డ్యామ్‌లను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఒకప్పుడు గజ్వేల్‌లో యాసంగిలో 7 వేల ఎకరాలు సాగు అయ్యేది.. ఇప్పుడు 17 వేల ఎకరాలను సాగు చేస్తున్నారు. 60 ఏండ్ల వెనుకకు ఉన్న గజ్వేల్‌ను 60 ఏండ్ల ముందుకు కేసీఆర్ తీసుకెళ్లారు. తెలంగాణ రాకముందు సిద్ధిపేటలో ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో ఆనాడు రైతులు, చేనేత కార్మికులు చనిపోతే పక్క రాష్ట్రల నుండి విలేకరులు వచ్చి వార్తలు రాసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. 60 సంవత్సరాలలో జరగని అభివృద్ధిని 6 సంవత్సరాలలో చేసి చూపాడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని తెలిపారు. దేశంలో మార్పు కోసం మన కేసీఆర్ బయల్దేరారు.. మన నినాదం ఒక్కటే.. అది రైతు నినాదం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. గులాబీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గులాం గిరి చేస్తుంది తప్ప ఢిల్లీ పెద్దలకు కాదని చెప్పారు.

# వైఎస్సార్‌టీపీ టీ-సేవ్ నిరాహార దీక్షకు తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్




హైదరాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద అఖిలపక్షం తలపెట్టిన టీ–సేవ్ నిరాహార దీక్షకు తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. షరతులతో కూడిన అనుమతి ఇచ్చినట్లు హైకోర్టు తెలిపింది. దీక్ష చేసే 48 గంటల ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలని హైకోర్టు వెల్లడించింది. 500 మంది కంటే జనసమీకరణ మించకూడదని హైకోర్టు సూచించింది. అయితే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ సోమవారం ఇందిరా పార్క్ వద్ద వైఎస్ఆర్టీపీ అధినేత్రి షర్మిల తలపెట్టిన ఒకరోజు నిరసన దీక్షకు ట్రాఫిక్ కారణాలు చూపుతూ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీనిపై పార్టీ నేతలతో ఆదివారం సమీక్షించిన షర్మిల దీక్షపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన నిరుద్యోగంపై తన పోరాటం ఆగబోదని షర్మిల అన్నారు. యువత భవిత కోసం తన ప్రాణాలను ఇచ్చేందుకూ సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కాగా.. తెలంగాణ లో శాంతి భద్రతలు క్షీణించాయని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేసీఆర్ నియంత పాలన కొనసాగిస్తున్నారు. దేశంలో భారత రాజ్యాంగం అమలులో ఉంటే తెలంగాణలో కేసీఆర్ రాజ్యాంగం అమలు అవుతుందని మండిపడ్డారు. తెలంగాణలో ప్రతిపక్షాలకు స్థానం లేదని, ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారని, రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు లేకుండా చేయాలనేది కేసీఆర్ ఉద్దేశమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీలో గూండాలు మాత్రమే ఉన్నారని విమర్శించారు. వీధి కుక్కలు దాడి చేసి పసి ప్రాణాలు తీస్తే పట్టించుకునే దిక్కులేదని, తెలంగాణలో అన్ని వర్గాలను కేసీఆర్ మోసం చేశారని, రాష్ట్రంలో ప్రభుత్వ యంత్రాంగాలను కేసీఆర్ గుప్పిట్లో పెట్టుకున్నారని షర్మిల ఆరోపించారు. ప్రజల పక్షాన తాను నిలబడితే ఇష్టం వచ్చినట్లు తనను తిట్టారని మండిపడ్డారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా ఇబ్బందులు పెడుతున్నారని, తొమ్మిది సంవత్సరాల్లో కేసీఆర్ తెలంగాణకు ఏం చేశారని ప్రశ్నించారు. ఎన్నికలు సజావుగా జరుగుతాయనే నమ్మకం వైఎస్ఆర్‌టీపీకి, ప్రతిపక్షాలకు లేదని షర్మిల అన్నారు.

# సింగరేణిపై నాతో చర్చకు సిద్ధమా.. బీఆర్ఎస్‌కు ఈటల సవాల్



హైదరాబాద్: సింగరేణి ప్రైవేటీకరణపై తనతో చర్చకు రావాలని బీఆర్ఎస్‌కు బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. సింగరేణి లాభాల్లో ఉంటే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఎందుకు బిడ్ వేయలేదో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎక్కడో ఉన్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కాదు.. పేదలకు అండగా ఉండే తెలంగాణ ఆర్టీసీని కాపాడాలని హితవుపలికారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పుణ్యాన నాలుగు వేల ఆర్టీసీ బస్సులు ఖతం అయ్యాయని మండిపడ్డారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ సంగతి సరే.. తెలంగాణ చెరుకు రైతుల కోసం నిజాం షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు తెరవటం లేదని ఆయన నిలదీశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేంద్రం, బీజేపీపై బీఆర్ఎస్ నేతలు విషం కక్కుతున్నారని మండిపడ్డారు. సింగరేణి మైన్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం మానుకోవాలన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయమని రామగుండం గడ్డ మీద ప్రధాని మాటిచ్చారని గుర్తుచేశారు. నైనీ బ్లాక్, తాడిచర్ల మైన్స్ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారన్నారు. తెలంగాణలో సమాచార హక్కు చట్టం అలంకారప్రాయంగా మారిందని విమర్శించారు. ఆర్టీఐ కింద అధికారులు సమాచారం ఇవ్వటం లేదన్నారు. సింగరేణిలో మూడు మైన్స్ ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన మాట వాస్తవమని చెప్పుకొచ్చారు. సింగరేణి బాగుండాలని కేంద్రంలో ఉన్న బీజేపీ ఆకాంక్ష అని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# సీఎం కేసీఆర్ ఆదేశాలతో చురుగ్గా ధాన్యం సేకరణ : మంత్రి గంగుల



కరీంనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు యాసంగి ధాన్యం సేకరణ చురుగ్గా కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని తన నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణకు పౌరసరఫరాల శాఖ సర్వం సిద్ధం చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిన్నటివరకూ 1131 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని అధికారులు వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు అనుకూల విధానాలు, రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచితకరెంటు, కాళేశ్వరం జలాలతో పంట విస్తీర్ణం ఏటా పెరుగుతూ రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరిస్తున్నామన్నారు, ఎలాంటి పరిస్థితుల్లోనైనా రైతు పండించిన చివరిగింజను మద్దతు ధరతో కొనాలన్న సీఎం ఆశయాలను అనుగుణంగా పనిచేస్తామన్నారు. ప్రపంచవ్యాప్త నివేదికల్లో ఓవైపు యావత్ ప్రపంచంలో 20ఏళ్ల కనిష్టానికి బియ్యం ఉత్పత్తి పడిపోతుంటే, కేవలం తెలంగాణలో మాత్రమే బియ్యం ఉత్పత్తి ఆరింతలు పెరిగిందన్నారు. ఇది తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ సాధించిన ఘనత అని మంత్రి పేర్కొన్నారు. అత్యధికంగా నల్గొండ, నిజామాబాద్‌లో ధాన్యం కొనుగోలు కొనసాగుతుందన్నారు . లక్ష్యం మేరకు సేకరణకు అవసరమైన 7031 పైచీలుకు కొనుగోలు కేంద్రాలు, గన్నీ బ్యాగులు, మాయిశ్చర్ మిషన్లు, వేయింగ్ మిషన్లు, హమాలీలను సమకూర్చుకున్నామని, అకాల వర్షాల నేపథ్యంలో టార్పలిన్లను సైతం అందుబాటులో ఉంచామన్నారు. ఈ సమీక్షలో సివిల్ సప్లైస్ కమిషనర్ అనిల్ కుమార్, పౌరసరఫరాల సంస్థ జీఎం రాజారెడ్డి, కరీంనగర్ అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, జిల్లా డీసీఎస్ఓ డీఎం ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'సనత్‌నగర్ బాలుడి మృతి బాధాకరం'



హైదరాబాద్: నగరంలోని సనత్‌నగర్‌లో ఎనిమిదేళ్ల బాలుడి మృతిపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. బాలుడి మృతి చాలా బాధాకరమని ఆవేదన చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే మంత్రి పోలీసుల అధికారులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. దోషులు ఎంతటి వారైనా చట్టపరంగా కఠినంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. సనత్‌నగర్‌లోని అల్లాఉద్దీన్ కోటికి చెందిన అబ్దుల్ వాహిద్ దారుణ హత్యకు గురయ్యాడు.

అమావాస్య వేళ బాలుడిని ఇమ్రాన్ అనే హిజ్రా బలి ఇచ్చినట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. గతరాత్రి ఓ ప్రాంతంలో క్షుద్రపూజలు జరిగినట్లు గుర్తించారు. పక్కనే ఉన్న నాలా సమీపంలో బాలుడి మృతదేహం లభ్యమైంది. దీంతో హిజ్రానే బాలుడిని చంపాడంటూ కోపంతో ఊగిపోయిన స్థానికులు హిజ్రా ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు. స్థానికుల ఆందోళనతో సనత్‌నగర్‌లోని అల్లాదున్ కోటి ఏరియాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





రంజాన్ వేళ పాతబస్తీ ప్రాంతాలు తళుకులీనుతున్నాయి. చారిత్రక చార్మినార్, మక్కా మసీద్‌లు విద్యుత్తు కాంతుల అలంకరణలో మెరిసిపోతున్నాయి. మరోవైపు చార్మినార్ పరిసరాల్లోని రాత్‌బజార్ దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.




# ఎముకలు విరిచేసి బకెట్‌లో కుక్కి.. అప్పుల గొడవకు బాలుడి బలి

సనత్‌నగర్: హైదరాబాద్‌లోని సనత్‌నగర్ పరిధిలో ఓ బాలుడు దారుణహత్యకు గురయ్యాడు. అప్పు తీర్చాలంటూ గత కొంతకాలంగా ఇద్దరి మధ్య జరుగుతున్న గొడవ హత్యకు దారితీసింది. బాలుడిని నరబలి ఇచ్చినట్లుగా కుటుంబసభ్యులు ఆరోపించినప్పటికీ.. ఆర్థిక వ్యవహారాల నేపథ్యంలోనే ఈ దారుణం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని బాలానగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ పారిశ్రామికవాడలోని అల్లాదున్ కోటిలో రెడీమేడ్ దుస్తుల వ్యాపారి వసీంఖాన్ తన కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయన కుమారుడు (8)ను స్థానికంగా నివసించే ఫిజాఖాన్ అనే ఓ హిజ్రా హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చిట్టీల వ్యాపారం నిర్వహించే ఫిజాఖాన్ వద్ద వసీంఖాన్ చిట్టీలు వేశాడు. దీనికి సంబంధించిన డబ్బును ఫిజాఖాన్ ఇవ్వకపోవడంతో గతకొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరి మధ్య గురువారం కూడా వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం వసీంఖాన్ కుమారుడిని నలుగురు వ్యక్తులు బస్తీలోని ఓ వీధిలో అపహరించారు.

ప్లాస్టిక్ సంచిలో తీసుకుని ఫిజాఖాన్ ఇంటి వైపునకు వెళ్లారు. బాలుడు కనిపించకపోవడంతో తండ్రి వసీంఖాన్ రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానికులు ఇచ్చిన సమాచారం, సీసీ ఫుటేజీల ఆధారాలతో నిందితులను పట్టుకున్నారు. బాలుడి మృతదేహాన్ని జింకలవాడ సమీపంలోని ఓ నాలాలో వేసినట్లు నిందితులు అంగీకరించడంతో గురువారం అర్ధరాత్రి పోలీసులు స్థానికుల సాయంతో నాలాలో వెతికారు. ఓ ప్లాస్టిక్ సంచిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించి వెలికి తీశారు. బాలుడిని హత్య చేసిన నిందితులు.. ఎముకలను ఎక్కడిక్కడ విరిచి ఓ బకెట్‌లో కుక్కారు. బకెట్‌ను ప్లాస్టిక్ సంచిలో తీసుకుని వెళ్లి నాలాలో విసిరేసినట్లు తెలిసింది. ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనతో అల్లాదున్ కోటి బస్తీలో ఉద్రిక్తత నెలకొంది.




ప్రముఖ మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్ యజమాని ఎలాన్ మస్క్ అనుకున్నంత పని చేశారు. ట్విటర్‌లో అధికారిక ఖాతాలకు ఇచ్చే 'బ్లూ టిక్'కు ఛార్జీలు తీసుకొచ్చిన మస్క్.. డబ్బులు చెల్లించని వారికి ఆ వెరిఫికేషన్ మార్క్‌ను తొలగిస్తామని చెప్పిన విషయం తెలిసిందే. పలుమార్లు వాయిదా పడిన ఈ ప్రక్రియ.. గురువారం నుంచి మొదలుపెట్టారు. దీంతో డబ్బులు చెల్లించని సెలబ్రిటీలు కూడా తమ ఖాతాలకు బ్లూ టిక్ కోల్పోవాల్సి వచ్చింది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, సినీ, క్రీడా రంగానికి చెందిన పలువురు ప్రముఖుల ఖాతాలకు ట్విటర్ వెరిఫికేషన్ బ్యాడ్జ్‌లను తొలగించింది. ఇకపై నెలవారీ ప్రీమియం చెల్లించిన వారికి మాత్రమే వెరిఫైడ్ బ్లూ చెక్‌మార్క్‌లను కొనసాగించనుంది.

**ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీల ఖాతాలకూ..** భారత్‌లో పలువురు రాజకీయ ప్రముఖులు, పలు పార్టీల అధికారిక ఖాతాలకు కూడా బ్లూ టిక్‌ను తొలగించారు. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, దిల్లీ, పంజాబ్, యూపీ ముఖ్యమంత్రులు వైఎస్ జగన్, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, యోగి ఆదిత్యనాథ్, తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు రాజకీయ నాయకుల ఖాతాలకు ఇప్పుడు వెరిఫైడ్ మార్క్ కన్పించట్లేదు. ఇక, భాజపా, కాంగ్రెస్ సహా పలు రాజకీయ పార్టీల అధికారిక ఖాతాలకు కూడా బ్లూ టిక్ తొలగించారు.

**సినీ, క్రీడా ప్రముఖుల ఖాతాలకూ..** సినీ ప్రముఖులు చిరంజీవి, అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, దీపికా పదుకొణె, ఆలియాభట్, క్రీడా రంగంలో సచిన్ తెందూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, సానియా మీర్జా, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా తదితరుల ఖాతాలకూ వెరిఫికేషన్ బ్యాడ్జ్ తొలగించారు. ఇక అంతర్జాతీయంగా పోప్ ఫ్రాన్సిస్, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రముఖ వ్యాఖ్యాత ఓప్రా విన్‌ఫ్రే తదితరులు కూడా బ్లూ టిక్‌ను కోల్పోయారు. ట్విటర్‌ను కొనుగోలు చేసిన తర్వాత నుంచి సంస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన ఎలాన్ మస్క్.. రెవెన్యూను పెంచుకునేందుకు బ్లూ టిక్‌కు సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనిపై తొలుత తీవ్ర గందరగోళం నెలకొంది. నకిలీ ఖాతాలు పెరగడంతో కొన్నాళ్లు ఈ సేవలను నిలిపివేశారు కూడా. ఆ తర్వాత తిరిగి బ్లూ టిక్ ప్రీమియం సేవలను ప్రారంభించారు. ఈ వెరిఫైడ్ సేవలను పొందాలంటే.. వెబ్ యూజర్లు నెలకు 8 డాలర్లు, ఐఫోన్, ఆండ్రాయిడ్ యూజర్లు నెలకు 11 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ చందాదారులకు తక్కువ ప్రకటనలు చూసే వెసులుబాటు, నిడివి ఎక్కువ ఉండే వీడియోలను పోస్ట్ చేసుకోవడం వంటి ప్రయోజనాలను కల్పించారు.

# కంటి వెలుగు అద్భుతమైన పథకం: మండలి చైర్మన్ గుత్తా



నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం అద్భుతమైన కార్యక్రమమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఈ పథకం పేద ప్రజలకు గొప్ప వరమని తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో కంటి వెలుగు పథకంలో భాగంగా తనకు మంజూరైన అద్దాలను ఆరోగ్య లబ్ధిదారులకు గుత్తా సుఖేందర్ రెడ్డి అందజేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలను సీఎం కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్నదని వెల్లడించారు. రైతులకు రైతు బంధు, రైతు బీమా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆరేనని చెప్పారు. రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన అద్దాలను కూడా ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. కంటి వెలుగు పథకాన్ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కొనియాడరని ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి గుర్తుచేశారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు.

# అంతమాత్రానికే భయపడుతారా?.. కడుపులో క్లాత్ మరిచిన ఘటనపై ఎమ్మెల్యే వింత సమాధానం..

జగిత్యాల: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఓ మహిళకు ఆపరేష్ చేసి కడుపులో క్లాత్ మరిచిన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ఘటనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. శుక్రవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి పేషెంట్ల తాకిడి పెరిగిందని.. అందుకే ఒకటి, రెండు ఘటనలు ఎక్కువ అవుతున్నాయని చెప్పుకొచ్చారు.

అంతమాత్రాన భయపడొద్దన్నారు. ఆస్పత్రుల్లో చనిపోతే ఆసుపత్రికి వెళ్ళటం మానేస్తామా అంటూ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వింత సమాధానం చెప్పారు. అయితే ఎమ్మెల్యే వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. 16 నెలల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళకు సర్జరీ ద్వారా ఆసుపత్రి వైద్యులు డెలివరీ చేశారు. అయితే కడుపులోనే బట్టను మరిచి ఆపరేషన్ పూర్తి చేశారు. సంవత్సరం తర్వాత మహిళకు తీవ్రమైన కడుపు నొప్పి వచ్చింది. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుల సూచన మేరకు స్కానింగ్ చేయించుకోగా.. కడుపులో బట్ట ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వైద్యులు మహిళకు ఆపరేషన్ చేసిన క్లాస్ తీసివేశారు. ఈ విషయం తెలుసుకున్న మహిళ బంధువులు.. క్లాత్ మరిచి ఆపరేషన్ చేసిన ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. స్థానిక పెద్దల జోక్యంతో బాధితురాలికి వైద్య ఖర్చులు ఇప్పిస్తామని బంధువులకు నచ్చ చెప్పడంతో ఆందోళన విరమించారు. రూ. 7 లక్షలు వైద్య ఖర్చుల నిమిత్తం రోగి బంధువులకు అందజేశారు. దీంతో అక్కడికి ఆ గొడవ సర్దుమణిగింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com